

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## నేడు యధావిధిగా పాఠశాలలు, జూనియర్ కళాశాలు

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 23, ప్రభాతవార్త** జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు, అంగన్వాడీ పాఠశాలలు శుక్రవారం నుంచి యధావిధిగా పనిచేస్తాయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, జూనియర్ కళాశాలలు కూడా యధాప్రకారం పనిచేస్తాయని కలెక్టర్ తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ సూచించారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, అక్టోబరు 23, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం సాయంత్రానికి 32232 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 69.679 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 200, ఎన్ఎఫ్‌సికి 50, పెన్నా డెల్టాకు 0, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం99.441 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## కేంద్ర మంత్రిని కలిసిన పెళ్లకూరు



**కోవూరు, అక్టోబరు 23ప్రభాతవార్త :** కేంద్ర గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డిని గురువారం వారి నివాసంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతన సలహా బోర్డు చైర్మన్ పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన గనుల శాఖలో ఉన్న కార్మికుల గురించి చర్చించి మంత్రి ద్వారా పలు సలహాలు, సూచనలు తీసుకున్నారు.

## టీడీపీలో కష్టపడి పని చేసిన వారికి తగిన గుర్తింపు

- కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ
- కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన మంత్రి



**నెల్లూరు, అక్టోబర్ 23, ప్రభాతవార్త – వైద్యం** కష్టపడి పని చేసిన కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ తగిన గుర్తింపుని ఇస్తుందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలియజేశారు. నెల్లూరు చింతారెడ్డిపా లెంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి నారాయణ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్ల ఇన్‌చార్జిలు కార్యకర్తలతో మంత్రి నారాయణ ప్రత్యేకంగా మాట్లాడారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలంటూ డివిజన్ ఇన్‌చార్జిలకు మంత్రి దిశా నిర్దేశం చేశారు. కమిటీల నియామకంపై కార్యకర్తలకు, నాయకులకు మంత్రి నారాయణ క్లారిటి ఇచ్చారు. తెలుగుదేశం పార్టీలో కష్టపడి పని చేసిన కార్యకర్తలకు నాయకులకు ఎల్లప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని తెలియజేశారు. కష్టపడి పని చేసి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలంటూ మంత్రి సూచించారు. రానున్న వర్షాలు నేపథ్యంలో కార్యకర్తలు ఎల్లప్పుడూ ప్రజలకి అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, టీడీపీ నెల్లూరు నగర అనధ్యక్షుడు మామిడాల మధు, అన్ని డివిజన్ల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జి టీడీపీ ముఖ్య నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పూడికతీత పనులు, సిల్ట్ తొలగింపును చర్యలు చేపట్టండి

- వీధి కుళాయి నీరు వృధాను స్వయంగా ఆపిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్,అక్టోబర్ 23,ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ స్థానిక 36వ డివిజన్ సి.ఏ.ఎమ్ స్కూల్ మార్గంలో గురువారం పర్యటించారు. వర్షాలకు ఆ ప్రాంతంలో డ్రైను కాలువల ప్రవాహాన్ని కమిషనర్ పరిశీలించారు. వరదనీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా పూడికతీత పనులను చేపట్టాలని, సిల్ట్ తొలగింపును కూడా క్రమం తప్పకుండా చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. మార్గమధ్యంలో వీధి కుళాయి నుంచి వృధాగా నీరు కారిపోవడాన్ని గమనించిన కమిషనర్ స్వయంగా కుళాయిని కట్టివేసారు. స్థానిక ప్రజలకు నీటి ఆవశ్యకతపై అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. నీటి వాడకం అయిపోయిన తర్వాత వీధి కుళాయిలను నిర్లక్ష్యంగా వదిలివేయకుండా తప్పనిసరిగా కట్టివేయాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం, శానిటేషన్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కండలేరు జలాశయం స్పిల్ వేను పరిశీలించిన సర్వేపల్లి ఎమ్మెల్యే

**పొదలకూరు, అక్టోబర్ 23, ప్రభాతవార్త** కండలేరు జలాశయం భారీ వర్షాలతో జలశయం పూర్తిగా నిండిపోయింది. 68 టిఎంసిల సామర్థ్యం కలిగిన కండలేరులో ఇప్పటికే 60 టిఎంసిలు దాటి పోయినట్లు తెలుగు గంగ ఇంజనీర్లు తేల్చారు. పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కొనసాగితే స్పిల్ వే గేట్లు తెరవక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి జలాశయం స్పిల్ వేను పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఈ సుబ్రమణ్యేశ్వర రావు, డ్యామ్ ఈఈ గజేంద్ర రెడ్డి, ఎడమ కాలువ ఈఈ అనిల్ కుమార్ రెడ్డి, బిఈ శివారెడ్డి, తహశీల్దార్ శివకృష్ణ ఉన్నారు. జలాశయ పరిస్థితులపై క్షుణ్ణంగా అధికారులతో మాట్లాడి స్పిల్ వే వద్ద అత్యవసరంగా చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ హిమాన్షు శుక్లతో ఫోన్‌లో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ భారీ వర్షాలతో కండలేరు జలాశయం నిండు కుండలా మారిందని, స్పిల్ వేలో మూడు గేట్లు ఉన్నాయని వీటి ద్వారా 50 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేసే ఏర్పాటు ఉందన్నారు. గేట్లు తెరిస్తే వరద జలాలు ఇక్కడ నుంచి 14 కిలోమీటర్లు మేర ప్రవహించి దేగపూడి వద్ద కండలేరు వాగులో కలిసిపోతాయి. స్పిన్ వే దిగువ ప్రాంతంలో 560 మీటర్ల అటవి భూమి ఉందని, కాల్వ త్రవ్వేందుకు అటవి శాఖ అభ్యంతరాలు చెపుతుందన్నారు. ఇప్పటి వరకు జరిగిన పనులు కాకుండా వరద నీరు సాఫీగా వెళ్లి కండలేరు వాగులో కలిసేందుకు కొత్తగా 95 కోట్ల రూపాయలతో పనులు చేపట్టాల్సి ఉందన్నారు. ఇది చాలా అత్యవసరమైన జలాశయం పనని వైసిపి ఐదేళ్ల పాలనలో ఈ అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసారని ఆరోపించారు. వైసిపి హయాంలో కమిషన్లు వచ్చే పనులకే ప్రాధాన్యత ఇచ్చారని, అత్యవసర పనులను గాలికి వదిలేసారని విమర్శించారు. జిల్లాకలెక్టర్, అటవిశాఖ అధికారులతో మాట్లాడి తక్షణం ఈ విషయంపై దృష్టి పెట్టి చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్ప టికీ జలాశయం పరిస్థితి ఇక్కడ ప్రజల అవసరాలను సీఎం చంద్రబాబుకి క్షుణ్ణంగా వివరించి పనులను మంజూరు చేయించి భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని ఆయన తెలియజేసారు. ఆయనతో పాటు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



## డ్రైన్ కాలువల వరదనీటి ప్రవాహంను పరిశీలించిన కమిషనర్





**నెల్లూరు కార్పొరేషన్, అక్టోబర్ 23, ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ స్థానిక జి.ఎన్.టి రోడ్డులోని కనక మహల్ కూడలి నుంచి ప్రధాన మార్గం వెంబడి డ్రైన్ కాలువల ద్వారా వరద నీటి ప్రవాహం జరుగుతున్న విధానాన్ని గురువారం పర్యవేక్షించారు. డ్రైన్ కాలువలపై తొలగించిన ఆక్రమణల డెబ్రిస్ ఇతర వ్యర్థాలను రోడ్లపై నుంచి పూర్తిస్థాయిలో తొలగించి రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రధాన రోడ్లపై వర్షపు నీరు నిలవకుండా అవసరమైన అన్ని చర్యలు నిరంతరం చేపట్టాలని, సమీప డ్రైన్ కాలువల ద్వారా సాఫీగా ప్రవహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు.

## నిరసనలు ఉధృతం చేయాలి : కాకాణి పూజిత



**నెల్లూరు రూరల్, అక్టోబర్ 23, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన ప్రజా ఉద్యమ కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 28వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల కేంద్రాలలో నిర్వహించ తలపెట్టిన ర్యాలీ పోస్టర్‌ను శాసనమండలి సభ్యులు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులతో కలిసి ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత. ఈ సందర్భంగా పూజిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రజలు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసనలు తెలియజేస్తున్నా పట్టించుకోకుండా, కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణను ముందుకు తీసుకొని వెళ్లడం దారుణమన్నారు. పేదవారికి కూడా నాణ్యమైన వైద్యం అందించేందుకు జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా రాష్ట్రంలోనే అన్ని వర్గాల ప్రజలకు విద్య, వైద్యం అందించాలనే గొప్ప ఆలోచనతో ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని రాష్ట్రానికి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను తీసుకొని వచ్చారు. గ్రామాలలో ఇంటి వద్దకే వైద్యం అందించేందుకు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి, జిల్లా ప్రధాన ఆసుపత్రులకు అనుసంధానం చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేశారన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని మరిచి, తమ స్వార్ధ ప్రయోజనాల కోసం పని చేస్తుందన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపేందుకు ప్రజలు కసిగా ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజలలో ఊహించని ఆదరణ లభించింది. అక్టోబర్ 28వ తేదీన నియోజకవర్గాల వారీగా చేపట్టనున్న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ప్రజా ఉద్యమం ర్యాలీలో స్వచ్ఛందంగా పాల్గొని తమ నిరసనను తెలియజేయాలని ప్రజలకు కోరుతున్నామన్నారు.

## రానున్న భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండండి

- ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండండి
- టెలికాన్ఫరెన్స్‌లో మున్సిపల్ శాఖ అధికారులకు, కమీషనర్లకు సూచించిన రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ
- నెల్లూరు నుండి టెలికాన్ఫరెన్స్‌లో అధికారులకు సూచనలు చేసిన మంత్రి
- లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని ఆదేశాలు
- ఎక్కడ కూడా అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా అందుబాటులో ఉండాలని సూచన



**నెల్లూరు, అక్టోబర్ 23, ప్రభాతవార్త -వైద్యం** ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలపై రాష్ట్ర పురపాలక శాఖ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ గురువారం మున్సిపల్ కమీషనర్లను అప్రమత్తం చేశారు. నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయం నుండి మున్సిపల్ కమీషనర్లు, ఉన్నతాధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, డైరక్టర్ సంపత్ కుమార్, మున్సిపల్ కమీషనర్లు టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొని మంత్రికి ఆయా ప్రాంతాల్లోని పరిస్థితిని వివరించారు. వర్షాల నేపథ్యంలో పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎలాంటి పరిస్థితులునైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఉండాలని సూచించారు. ఇంజనీరింగ్, పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని తెలియజేశారు. వర్షాల కారణంగా తాగునీరు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని మున్సిపాలిటీల్లో 24 గంటలు పని చేసేలా కాల్ సెంటర్ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ముందస్తు జాగ్రత్తగా ప్రైవేటు మినరల్ వాటర్ ప్లాంట్‌లను కూడా ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలన్నారు. పోలీసు, వైద్యారోగ్య శాఖ సిబ్బందితో సమన్వయం చేసుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి నారాయణ అధికారులకు సూచించారు.

## వలేటివారిపాలెంలో వర్షాలు - రోడ్లుపై నిలుస్తున్న వర్షపునీరు



**వలేటివారిపాలెం అక్టోబరు 23, ప్రభాతవార్త** మండలంలో గత మూడు రోజులుగా చెదురు మదురు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో గ్రామాల్లోని అంతర్గత రోడ్లు లింకు రోడ్లు ఛిద్రమవుతు న్నాయి. సిసి రోడ్ల వెంట సైడు కాలువలు తీయకపోవడంతో రహదారులపై నిలుస్తుంది. రోడ్లపై నుంచి ఇళ్లలోకి చేరుతుంది. దీంతో రోడ్లే వ్యాధికారకాలకు ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. రోడ్లపై వర్షపు నీటితో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అయ్యవారిపల్లె ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారి వర్షపునీటితో మునిగిపోయింది. జాతీయ రహదారి నుంచి కాకర్లపాలెం రోడ్డు గుంతలమయం అయింది. ఈ గుంతల్లో నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. పోకూరు బస్టాండ్ దగ్గర నుండి సచివాలయం వరకు వెళ్ళే వి.ఆర్.కోట రోడ్డుపై వర్షపు నీరు అడుగుపైనే చేరి ఉన్నాయి. ఇరువైపుల ఉన్నసైడ్ కాల్వలలో పూడిక తీయకపోవడం, ఆక్రమణలకు గురికావడంతో కొద్దిపాటి వర్షానికి రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. పోకూరు బస్టాండ్ దగ్గర నుండి కుమ్మరిపాలెం వరకు రోడ్డు విస్తరణ కార్యక్రమంచేపట్టి జనం వెతలు తీర్చగలరని జనసేనపార్టీ నేతలు కోరుతున్నారు.

**స్పందించిన ఎండీవో** గ్రామాల్లో నెలకొన్న పరిస్థితిని తెలుసుకున్న ఎంపీడీవో శంకరరావు స్పందించారు. అయ్యవారిపల్లె ఎస్సీ కాలనీ రహదారిపై నిలిచిన నీటిని మంగళవారం పొక్లెయిన్‌తో తొలగింపచేశారు. అదేవిధంగా బుధవారం పోకూరు సినిమా హాల్ సెంటర్‌లో చేరిన వర్షపునీటిని సైడ్ డ్రైన్స్ పూడిక తీయించి ట్రాక్టర్ ద్వారా పక్కకు తొలగించారు. అదేవిధంగా నేకునాంపురం పంచాయతీలో ఎస్సీ కాలనీ నందు స్టాగ్ నేషన్ నిలిచిన వర్షపు నీటిని తొలగించారు.

## ప్రమాదపు అంచున మలిదేవి డ్రైన్

- వాహనచోదకులకు తిప్పలు
- పట్టించుకోని అధికారులు



**విడవలూరు,అక్టోబర్ 23 ప్రభాతవార్త :** మండల కేంద్రం నుండి జాన్ పేట, మన్మధరావుపేట, చెలికల గ్రామాలకు వెళ్లే మార్గం మధ్యలో ఉన్న మలిదేవి డ్రైన్ వంతెన గుర్రపు డెక్క అడ్డుగా ఉండడంతో వర్షపు నీరు డ్రైన్లోకి అధికంగా చేరడంతో మలిదేవి డ్రైన్ పొంగి ప్రమాదపు అంచున దర్శనమిస్తుంది. ఒకవైపు భారీ వర్షాలు అధికంగా రావడంతో ఎగువ ప్రాంతాల నుండి వచ్చే వర్షపు నీటితో మురికి నీరు కూడా అధికంగా చేరుతున్నాయి. గత రెండేళ్ల నుండి ఈ బ్రిడ్జి వంతెనపై వరద ప్రవాహం ప్రవహించడంతో అటు ఇటు రాకపోకలు నిలిచిపోయినాయి. అధికారుల చొరవతో బోటు సదుపాయంతో విడవలూరు నుండి జాన్ పేట గ్రామాలకు వెళ్ల పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. అప్పటిలో విద్యార్థులు, వ్యాపారుస్తులు, ఉద్యోగులు, వాహన చోదకులు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నామని ఆయా గ్రామస్తులు ఆవేదన చెందారు. గతంలో జరిగిన సంఘటనలు పునర్వృతం కాకుండా ఉండాలంటే అధికారులు చొరవ చూపి మలిదేవి డ్రైన్ వంతెన లో ఉన్న గుర్రపు డెక్కను తొలగించి నీటి సరఫరా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**వివరణ:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మలిదేవి కాలువలో ఉన్న గుర్రపు డెక్క తొలగింపు పై స్థానిక తహశీల్దార్ కె. చంద్రశేఖర్ ను వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ ఈ సమస్యపై పై అధికారులకు తెలియపరచి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## ఇదీ ప్రభుత్వ జిల్లా కార్యాలయమా ?

ప్రజానీకానికి మీరా ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించేది .
జిల్లా కార్యాలయంలో పరిసరాలపై ముందు మీకు అవగాహన రాదా ?
ఎంత కాలం ఇలా దుర్గంధం

**నెల్లూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త -వైద్యం** అదీ జిల్లాలోని ప్రజలందరికీ ఆరోగ్య సూత్రాలను వల్లె వేస్తూ, వీధులు, కాలువలు శుభ్రంగా ఉండాలని, తద్వారా జనానికి ఏరోగాలు అంటుకోవని చైతన్యం చేస్తూ ముందుకెళ్తున్న జిల్లా కార్యాలయం అలాంటి కార్యాలయంలో పరిశుభ్రత కాగడాపెట్టి వెతికినా కనిపించదు. చెత్తాచెదారాలకు నిలయమే కాదండోయ్ , ఆ కార్యాలయంలో లోపలికి వెళ్లాలంటే అడుగు తీసి అడుగు పెట్టుకుంటూ ఎంతో జాగ్రత్తగా వెళ్లాలి. వర్షానికి ఈ కార్యాలయంలో ఉన్న రోడ్లు వాగులను తలపిస్తాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చిత్తడిగా మారి కార్యాల్నయ లోపలికి వెళ్లాలంటేనే, ఏం వ్యాధులు అంటుకుంటాయో అన్న ధోరణి కలిగించే పరిస్థితి ఆ కార్యాలయం సొంతం. అదేదో కాదండోయ్ నెల్లూరులోని పాత మున్సిపల్ కార్యాలయానికి చేరువలో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఈ కార్యాలయంనుంచే, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి వి.సుజాత వైద్యులను శాసిస్తారు. విధులకు సక్రమంగా హాజరుకావాలని, నాణ్యమైన వైద్యాన్ని ప్రజలకు అందించాలని , ఇంటాబయటా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అనేక సభలు , సమావేశాల్లో మైకు పట్టుకుని నినదిస్తుంటారు అలాంటి ఈ కార్యాలయంలో లోపలికి వెళ్లేందుకు రోడ్లు సరిగా లేక పిచ్చి మొక్కలు మొలిచి విరిగిపోయిన చెట్ల కొమ్మలు అక్కడక్కడ దర్శనమిస్తూ ఇదేనా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం అనే అంత అనుమానం కలిగించేదిగా ఈ కార్యాలయం ఉంటుంది. అనడంలో తిశయోక్తిలేదు ఇకనైనా జిల్లా స్థాయి అధికారులు ఈ కార్యాలయాన్ని సందర్శించి అందరికీ ఆరోగ్య సూత్రాలు అందించే ఇలాంటి చోట పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం కల్పించి, ఉద్యోగులకు, సందర్శించే ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించాలని ప్రజలంతా కోరుతున్నారు





## వైసిపి యాక్టివిటి విభాగం జిల్లా కార్యదర్శిగా కోడూరు



**బుచ్చి అక్టోబర్ 23 ప్రభాతవార్త :** వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ యాక్టివిటి విభాగం నెల్లూరు జిల్లా కార్యదర్శిగా బుచ్చిరెడ్డిపాళెం మండలం ఇస్కపాళెంకి చెందిన కోడూరు మధుసూదన్‌రెడ్డి నియమితులైయ్యారు. నియమితులైన సందర్భంగా మాజీ మంత్రి వర్యులు వైసిపి రాష్ట్ర పిఏసి సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని మర్యాపూర్వకంగా కలిసి పూలబొక్కే ఇచ్చి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపినాయకులు షేక్ షాహుల్, డాక్టరు అల్లాబక్షు, షేక్ షకిలాబేగం, బాల శంకర్‌రెడ్డి, విల్సన్, వెంకయ్య తదితరులు పాల్గోన్నారు.

## రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి



**నెల్లూరు క్రైమ్, అక్టోబర్ 23, ప్రభాతవార్త :** నెల్లూరు రైల్వే స్టేషన్ బుకింగ్ కౌంటర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మరణించి ఉండడాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని, సుమారు 55 ఏళ్ల వయసు ఉంటుందని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు బులుగు రంగు గల ఫుల్ హాండ్స్ షర్ట్, మెరూన్ కలర్ డిజైన్ లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి రైల్వే ఎస్సై హరిచందన కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పాఠశాల విద్యార్థులను ఆదార్ సెంటర్లకు తీసుకురండి;యండిఓ

**కలిగిరి, అక్టోబర్23, ప్రభాతవార్త;** కలిగిరి మండలంలో చదువుతున్న ఉన్నత పాఠశాల వద్యార్థినీ ,విద్యార్థులను సంబందిత ఉపాధ్యాయులు, అధికారులు, శిబ్బంది ఆదార్ సెంటర్లకు తీసుకురావాలని యంపిడిఓ ప్రత్యూష ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24నుండి 30 వతేదీవరకు జరుగు ఆదార్ కార్యక్రమానికి విద్యార్థులను తప్పక తీసుకురావాలన్నారు. దీనికోసం సచివాలయ ఉద్యోగులుకూడా ఉపాధ్యా యులకు సాయపడాలన్నారు. కలలిగిరి మండలంలోని24నుండి 30వరకు కలిగిరి 1 సచివాల యం 24నుండి26వరకుతెల్లపాడు; 27నుండి 28వరకు లక్ష్మీపురం, 29నుండి 30వరకు క్రాకుటూరు సచివాలయ పరదిలో ఆదార్ సెంటర్లు నిర్వహించబడతాయన్నారు.

## తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో ఉంచిన వ్యక్తి

**తోటపల్లి గూడూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త:** మండలంలో ని కోడూరు గ్రామంలో గురువారం తెలుగుదేశం పార్టీ నేతలు మీడియా సమావేశం నిర్వహించి, ఇటీవల జరిగిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. గత 12వ తేదీ కోడూరు ముక్కంటి అమ్మ ఆలయం వద్ద తమ నేతలపై అవమానకర వ్యాఖ్యలు చేసిన వ్యక్తి తన వ్యక్తిగత జీవితమే ప్రశ్నార్థకమని వారు ఎద్దేవా చేశారు. తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో తోసి, భార్యను నిర్లక్ష్యం చేసి, మరో వివాహం చేసుకున్న వ్యక్తి ఇతరులపై విమర్శలు చేయడం అవమానకరమని టిడిపి నేతలు మండిపడ్డారు. మట్టి మాఫియా, దొంగతనాలు, దౌర్జన్యాలు అతని జీవిత విధానంగా మారాయని వారు ఆరోపించారు. సోమిరెడ్డి, గంగాధర్‌పై విమర్శలు తగవు తమ పార్టీ నేతలైన సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వీరబోయిన గంగాధర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను టిడిపి నాయకులు తీవ్రంగా ఖండించారు. ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. వైకాపా నాయకత్వానికి హెచ్చరిక ఇలాంటి వ్యక్తులను తమ పార్టీలో కొనసాగించటం వైకాపా నాయకత్వానికి మైనస్ అవుతుందని, ఆ వ్యక్తిని వెంటనే బహిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టిడిపి బీసీ నేత బత్తల వెంకటరమణయ్య, ఎస్సీ నాయకులు తేలిమేటి సునీల్, బి. శ్రీనివాసులు, కావలి సురేష్, తేలిమేటి ఉదయ్, గడ్డం శ్రావణ్, సందీప్, ఎన్. వెంకయ్య, నిరంజన్, బల్లెం జగన్నాథం, గోళ్ళ చెన్నకేశవులు, కే. మల్లి, నక్క చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహశీల్దార్



**విడవలూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త:** మండలంలోని లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరు కూడా పెన్నా నదికి, సముద్ర తీరానికి వెళ్ళరాదని స్థానిక తహశీల్దార్ కె.చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమశిల నుండి పెన్నా నదికి 42 వేల 460 క్యూసెక్కులు నీటిని విడుదల చేయడం జరిగిందని తెలియజేశారు. భారీ వర్షాలకు కంట్రోల్ రూమ్ వద్ద నియమించిన మండల స్థాయి అధికారులు గ్రామస్థాయి అధికారులకు సమాచారాన్ని తెలియపరచి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. గ్రామ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకుంటూ కంట్రోల్ రూమ్‌కు తెలియ పరచాలని తెలియజేశారు.

## పేకాటలో చిక్కిన హెడ్ కానిస్టేబుల్ సస్పెండ్

**నెల్లూరు క్రైమ్, అక్టోబర్ 23, ప్రభాతవార్త :** చిన్న బజార్ పోలీసులు బుధవారం నగరంలోని ఓ ప్రముఖ హోటల్‌లో పేకాట ఆడుతున్న జూదరులను పట్టుకున్న సంగతి విధితమే. పట్టుబడిన వారిలో విడవలూరు పోలీస్ స్టేషన్లో విడవలూరు హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పుల్లారెడ్డి ఉన్నారు. దీంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల పుల్లారెడ్డిని సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

## ఉదయగిరి మండల ప్రజలకు పోలీసు వారి హెచ్చరిక



**ఉదయగిరి, అక్టోబర్ 23, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల ప్రజలకు ఉదయగిరి పోలీసు వారి హెచ్చరిక.. ఇటీవల కాలంలో కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు గ్రామాలు ముఖ్యంగా కొండ కింద పల్లెలు, కుర్రపల్లి, నేలటూరు, కృష్ణంపల్లి, పుల్లాయపల్లి, శకునాలపల్లి, బిజ్జంపల్లి, బోడబండ, అన్నంపల్లి, అయ్యవారిపల్లి, బీజంపల్లి, జి.చెరువుపల్లి, జి.చెర్లోపల్లి గ్రామ ప్రజలకు ఎలాంటి అవసరం వచ్చినా వెంటనే పోలీసులకు ఫోన్ చేయాల్సిందిగా కోరారు. ఫోన్ నెంబరు సీఐ 9440700001, ఎస్సై 9440700002 నంబర్లకు సమాచారాన్ని తెలియపరచాలని సీఐ వెంకట్రావు తెలిపారు.

## హౌసింగ్ లబ్దిదారుల వివరాలు నమోదుకు వచ్చే నెల 5వరకు గడువు



**ఉదయగిరి, అక్టోబర్ 23, ప్రభాతవార్త :** ఉదయగిరి మండలంలోని 17 పంచాయతీలలో 905 మంది హౌసింగ్ లబ్దిదారుల వివరాలను నవంబర్ 5వ తేదీ లోగా ఆవాజ్ యాప్‌లో నమోదు చేయాలని ఎంపీడీవో బి.శ్రీనివాసులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఉదయగిరి శ్రీశక్తి భవనంలో హౌసింగ్ సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పంచాయతీకి ఒక వ్యక్తిని కేటాయించాలని లబ్దిదారుల వివరాలను జియో టాకింగ్‌తో పాటు లబ్దిదారుల ఎఫ్ఆర్ఎస్ నా దగ్గర తీసుకోవాలని సూచించారు. అలాగే హౌస్ హోల్డ్ మ్యాప్‌లో ఉన్నటువంటి పూర్తి డేటాను జియో టాకింగ్‌లో పెట్టాలని కోరారు.

## వానాకాలంలో పొగనారు తీయరాదు



**కలిగిరి, అక్టోబర్23, ప్రభాతవార్త;** వానలు పడే సమయంలో పొగనారు తీయడం మంచిదికాదని కలిగిరి పొగాకు బోర్డు వేలం నిర్వాహణాధికారి శివకుమార్ దిగ్రేట్ తెలి పారు. గురువారం బోర్డు శిబ్బందితో కలసి పొగనారు మళ్లను వెలం నిర్వాహణాధికారి పరిశీలించారు. అదేవిదంగా నారుమళ్ల రైతులతో మాటాడి వానలు పడుతున్న ందున నారుమళ్ల మార్పులపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ గత పదిరోజులపైగా వానలు పడుతున్నందున పొగనారులో తెగుళ్లు సోకే ప్రమాద ముంద న్నారు. అదేవిదంగా నారుమళ్లలో నీరు నిలువ వున్నందున నారు మురిగి పోయే ప్రమాదము ందన్నారు. అదుచేత రైతుసోదరులు నారు మడుల్లో నీరు నిలువకుండా చూసుకోవాలన్నారు. అంతేగాక నారుతీసే సమ యంలో వానలు పడరాదన్నారు. ఎండకాసే సమయంలోనే పొగనారు తీయాల న్నారు. వర్షం పడుతున్న సమయంలో నారు తీయడంవల్లనారు మడులు దెబ్బతింటాయన్నారు. ప్రస్తుతం పడుతున్న వానలు వల్ల పొగనారులో శిలీంద్రయలవల్ల వచ్చే జబ్బులు అదికంగా ఉంటాయన్నారు. ముఖ్యంగా మాగుడు, ఆకు మచ్చ తెగులు ,వేరుకుళ్లు తెగులు లాంటి జబ్బులు వాటెల్లే ప్రమాదం ఉందన్నారు. వీటి నివారణకు శిలీంద్రియాలు మొక్కలను ఆశించకుండా బ్లాక్ టాక్స్ కానీ శిలీంద్రనాసినినికానీ పిచికారీ చేయాలన్నారు.

## వరద ప్రవాహం అధికం ప్రజలు జాగ్రత్తగా ఉండాలి



**కొడవలూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త:** సోమశిల ప్రాజెక్టుకు అధిక వరద ప్రవాహం చేరడంతో గురువారం పెన్నా నదికి నీటి విడుదల చేయడం జరిగిందని తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమశిల నుండి 42. 460 క్యూసెక్కులు పెన్నాకు విడుదల చేశారు. భారీ వర్షాలకు ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ సురక్షితంగా ఉండాలని కోరారు. మండలంలో లోతట్టు గ్రామాల, కాలనీల ప్రజలను మండల స్థాయి అధికారులు అప్రమత్తం చేయాలని సూచించారు. అదేవిధంగా ఎప్పటికప్పుడు సమాచారం కంట్రోల్ రూమ్ కు తెలియప రచాలన్నారు.

# రైతు సంక్షేమం అంటూ రైతును గాలికొదిలేసిన ప్రభుత్వం

- రైతుకు పట్టాదారు పాస్ పుస్తకాలెక్కడా..? - ఖరీఫ్‌లో గిట్టుబాటు ధర లేక నష్టాలు చవిచూసిన రైతు
- ప్రస్తుత రబీలోనైనా ప్రభుత్వం తమ పట్ల కనికరిస్తుందేమోనన్న ఎదురుచూపు - ఈ ఖరీఫ్‌లో గతం కన్నా ముందుగానే నారుమళ్ళకు సిద్ధం



**నెల్లూరు అగ్రికల్చర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త** రైతు సంక్షేమం కోసం పాటుపడుతున్నామని, అందుకే అన్నదాత – సుఖీభవ పథకం అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం అసలు అందించాల్సిన పట్టాదారు పాస్ బుక్‌ల మాటే మరిచిపోయినట్టుంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఒకటిన్నర సంవత్సరం గడుస్తున్నా, ఇంత వరకు పాసు పుస్తకాల ఊసే లేదు. రైతు సంక్షేమం అంటే అన్ని విధాల రైతును ఆదుకోవడమే. రైతు లాభదాయకంగా ఉంటే రాష్ట్రం బాగుంటుంది. అన్ని వ్యాపారాలు సజావుగా సాగుతాయి. రైతే చితికి పోతుంటే ఏ వ్యాపారం ముందుకు రాదు. ఇది పట్టణాలు, నగరాల్లో ఉండే అన్ని రంగాల వ్యాపారులకు బాగా తెలుసు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల అమలును ప్రభుత్వం మరిచిపోయినట్టుంది. తాము అధికారంలోకి వస్తే గత ప్రభుత్వం అనుసరించిన రైతు వ్యతిరేక విధానాలకు స్వస్తి చెప్పి రైతును లాభాల బాట పట్టిస్తామని జగన్ బొమ్మను పాసు పుస్తకాల్లో తొలగించి ప్రభుత్వ రాజముద్రతో పాసు పుస్తకాలు అందిస్తామని మాటిచ్చి ఒక సంవత్సరం ఏడు నెలలు గడుస్తున్నా, ఇంత వరకు అమలుకు నోచుకోకపోవడం శోచనీయం. ఓ 5,6 ఎకరాలున్న చిన్నపాటి రైతు ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ సాయం ఏడు వేల రూపాయల పెట్టుబడితో నెట్టుకు రావడం కష్టతరం. అన్నదాత సుఖీభవ పథకంలో ఇచ్చే 20 వేల రూపాయలను ప్రభుత్వం మూడు విడతల్లో అందిస్తామని చెబుతోంది. ఇప్పటికి ఈ ప్రభుత్వం వచ్చాక ఒక విడత కొంత మందికి 5 వేలు, కొంత మందికి 6వేలు అందించి చేతులు దులుపుకుంది. ప్రస్తుతం ప్రారంభమవుతున్న రబీ సీజన్‌కి, రైతుకు పెట్టుబడి సాయం అందించాలన్న ధ్యాసే ప్రభుత్వానికి లేనట్టుంది. నెల్లూరు జిల్లాలో గతం కన్నా ముందుగానే గ్రామాల్లో చెరువులు నిండే పరిస్థితి ప్రస్తుతం కురుస్తున్న ఈ వర్షాల నేపథ్యంలో తెలుస్తోంది. ఈ నెలలోనే తుఫాన్లు, వర్షాలు మొదలయ్యాయి. గత కొన్ని ఏళ్లుగా నెల్లూరు జిల్లాలో నవంబర్ నెలలో వచ్చే తుఫాన్లు, వరదల కారణంగా గ్రామాల్లో చెరువులు నిండేవి. ఈ ఏడాది అక్టోబర్ చివరి నాటికి రైతాంగం నార్లు పోసుకునే ఉర్పాట్లు చేసుకుంటున్నారు. దీన్ని ప్రభుత్వం గమనించాలి. ఎందుకంటే ఇప్పటికే చెరువుల్లో సగానికి పైగా నీరు చేరిన నేపథ్యంలో రైతు ఆ దిశగా సమాయత్తమవుతున్నాడు. ఇలాంటి సమయాల్లో ప్రభుత్వం అందించే పథకాల కోసం ఎదురు చూస్తే రైతు పంట పండించగలడా..? అసలే ఈ ప్రభుత్వం వచ్చాక రెండు దఫాలుగా గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలం కావడంతో జిల్లాలోని రైతులు ప్రభుత్వంపై రైతులు అగ్గిమీద గుగ్గిలంలా ఉన్నారు. గిట్టుబాటు ధర కాదు గదా, కనీస మద్దతు ధరకు కూడా నోచుకోని రైతు, నిరాశ నిస్పృహలను వ్యక్తం చేస్తూ ఈ ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నాడు. ఎందుకంటే ఈ ఖరీఫ్ సీజన్‌లో అన్ని ఉండి అల్లుడి నోట్లో శని లాగా రైతు సేవా కేంద్రాలు ప్రత్యేకంగా ఉండి కూడా, ముందుగా ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయడంలో విఫలం కావడంతో రైతును మరింత కుంగుబాటుకు గురి చేసింది. 21,000, 22000 అమ్మే ధాన్యం రూ.13వేలు నుంచి రూ.16వేల లోపే తెగనమ్ముకునే పరిస్థితిని రైతు జీర్ణించుకోలేకున్నాడు. ఇదంతా ప్రభుత్వం పట్టించుకోకుండా రైతు సంక్షేమం కోసం మేము కృషి చేస్తున్నామని చెప్పడం ఎంత వరకు సమంజసమని రైతులు బాహాటంగానే ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుత రబీ సీజన్లోనైనా గిట్టుబాటు ధర కల్పించేందుకు ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టకపోతే ప్రభుత్వంపై రైతు సంఘాలు, రైతులు సమరం సాగించేందుకు సమాయత్తం కాక తప్పదేమోనని అనిపిస్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ రబీ సీజన్‌కు ముందే పట్టాదారు పాసు పుస్తకాలు అందిస్తే ఆ పుస్తకాలతో బ్యాంకుల ద్వారా రుణాలు పొంది పంటలు పండించే వీలుంటుంది. కనీసం అందుకైనా ప్రభుత్వం తమకు అనుకూలమైన చర్యలు చేపడుతుందేమోనని జిల్లాలోని రైతాంగం అంతా ఎదురుచూస్తున్నారు.

## సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి



**విడవలూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త:** విడవలూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ యాటగిరి ప్రవీణ్ కుమార్ తండ్రి బాబు రావు ఇటీవల గుండె పోటుతో మృతి చెందడంతో మన్మధరవు పేట లో వారి నివాసానికి మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర పి ఏ సి సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి వెళ్లి ఉత్తరక్రియలు పాల్గొని వారి చిత్రపటానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతోపాటు రాష్ట్ర ఆఫ్కాఫ్ మాజీ చైర్మన్, కోవూరు నియోజకవర్గ పరిశీలకులు కొండూరు అనిల్ బాబు, విడవలూరు మండల పార్టీ అధ్యక్షులు కాటంరెడ్డి నవీన్ రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు కొండూరు వెంకట సుబ్బారెడ్డి , బుచ్చి రూరల్ మండల పార్టీ అధ్యక్షులు చెర్లో సతీష్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, స్థానిక వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి ఆలయంలో 8వ రోజు బిక్ష కార్యక్రమం



**రాపూరు, అక్టోబరు23ప్రభాతవార్త :** మండల కేంరదమైన రాపూరులోని శ్రీశ్రీ మహా విష్ణువు, శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి వారి ఆలయంలో మండల కాల అన్నదాన కార్యక్రమంలో బాగంగా ఎనిమదవ రోజైన గురువారం అయ్యప్ప స్వామి, గోవింద స్వామి, శివ స్వామి మాలాధరణ చేసిన స్వాములకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్తీక మాసం ప్రారంబం సందర్భంగా ఉదయం గణపతి హోమం, అయ్యప్ప స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. కార్తీక మాసంలో ప్రతి రోజు ఆలయంలో గణపతి హోమం, సాయంత్రం అకాశీదీపం ప్రజ్వలన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం మహావిష్ణువు స్వామి వారి ధ్వజస్థంభం వద్ద అకాశ దీపం పెట్టారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గోని స్వామి వారికి పూజలు నిర్వహించారు. 8వ రోజు అన్నదాన కార్యక్రమానికి ఉభయకర్తలుగా తూమాయి గ్రామానికి చెందిన పైడిపూల వెంకటసుబ్బయ్య సుశీలమ్మ దంపతులు, వారి కుటుంబసభ్యులు, గుండవోలు గ్రామానికి చెందిన గుండవోలు పెంచలనరసింహం, ప్రభావతమ్మ దంపతులు వ్యవహరించారు.

## అనంతసాగరం పిహెచ్‌సిని తనిఖీ చేసిన అడిషనల్ డిఎంఅండ్‌హెచ్ఓ



**అనంతసాగరం, అక్టోబరు 23, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన అనంతసాగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా అదనపు ఆరోగ్య ,వైద్యాధికారి , జిల్లా క్షయనియంత్రణాధికారి షేక్ ఖాదర్‌వల్లి తనిఖీ చేశారు. ఈసందర్భంగా క్షయవ్యాధికి సంబంధించిన పలు ల్యాబ్ రికార్డులను, గల్ల పరిక్షలను తనిఖీ చేశారు. క్షయ వ్యాధిగ్రస్తులకు సకాలంలో మందులు , చికిత్స అందజేయాలని వైద్యసిబ్బందికి సూచించారు. మండల ప్రజలకు రెండువారాలకు పైబడి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, నీరసం, రాత్రిపూటల్లో చమట పట్టడం వంటి లక్షణాలు ఉంటే గల్ల పరిక్ష చేయించుకోవాలని, అనంతసాగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అధునాతన ల్యాబ్‌ఉందని ప్రజలకు తెలిపారు. వైద్యాధికారులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ల్యాబ్ టెక్నీషియన్ షేక్ మీరామొహిద్దీన్, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## నాలుగు అడుగుల నీటి మట్టానికి చేరిన గండిపాలెం జలాశయం



**ఉదయగిరి, అక్టోబర్ 23, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని గండిపాలెం చెంచు రామయ్య జలాశయానికి గురువారం నాటికి నాలుగు అడుగుల నీరు చేరినట్లు ఇన్‌చార్జి ఇరిగేషన్ డీఈ చంద్రమౌళి తెలిపారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జలాశయం ఎగువ ప్రాంతాల నుంచి 700 క్యూసెక్కులు వరద నీరు వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 456 అడుగులు నీటి మట్టం ఉందన్నారు. కావున వ్యవసాయం చేసుకునే రైతులు మీరు చేరే విధానాన్ని బట్టి పంటలు వేసుకోవాలని తెలిపారు. ఇంకా వర్షాకాలం ఉన్నందున ఇంకా నీరు చేరే అవకాశం ఉందని తెలిపారు.

## వర్షాలకు పంటలు దెబ్బతినకుండా జాగ్రత్తలు పాటించాలి



**ఉదయగిరి, అక్టోబర్ 23, ప్రభాతవార్త :** ఉదయగిరి డివిజన్ పరిధిలోని రైతులు ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతినకుండా జాగ్రత్త పాటించాలని ఏడీఏ చెన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలు తగ్గే వరకు కోతకు వచ్చిన పంటను కొయ్య వద్దని సూచించారు. ఉదయగిరి డివిజన్ పరిధిలో 90శాతం సజ్జ పంట కోత జరిగిందన్నారు. ఉద్యాన పంటలైన కంది, ఉలవ, అలసంద, మినుముకు ఈ వర్షం ఎంతో మేలు జరుగుతుందని ఆయన అన్నారు. అలాగే ఎడతెరిపి లేని వర్షాలకు విద్యుత్ మోటర్ల దగ్గర చాలా జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. వ్యవసాయానికి అనుకూలంగా ఈ సమయం ఉందని ఆయన అన్నారు.

## రేపటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపు మొదలు



**ఉదయగిరి, అక్టోబర్ 23, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలోని గవర్నమెంట్ హైస్కూల్ నందు పిల్లలకి ప్రత్యేక ఆధార్ కేంద్రాలను 24వ తేదీ నుండి 30వ తేదీ వరకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. ఉదయగిరి మండల పరిధిలోని 12 సచివాలయాల పరిధిలో చిన్న పిల్లలకు ఆధార్ కార్డులు అప్డేట్, చేర్పులు మార్పులు చేసుకోవద్దని తెలిపారు. ఎవరైనా కొత్తగా ఆధార్ కార్డులు నమోదు చేయించుకోవాలనుకుంటే ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారని తెలిపారు. ఆధార్ అప్డేట్ చేసే వ్యక్తి ఉదయగిరి సచివాలయం ఒకటి, రెండు, మూడు సచివాలయాల మహిళా పోలీసు సిబ్బంది తదితరులు ఈ క్యాంపు నందు ఉంటారని మీ సందేశాలు వారికి తెలియపరచాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసులు కోరారు.

## కండలేరులో 59.810 టీయంసీల నీటిమట్టం



**కండలేరుడ్యాం(రాపూరు), అక్టోబరు23ప్రభాతవార్త :** మండలంలోని కండలేరు జళాశయంలో గురువారం ఉదయం నాటికి 59.810 టీయంసీల నీటి మట్టం నమోదు అయినట్లు కండలేరు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.అనీల్ కుమార్ తెలిపారు. సోమశిల కండలేరు వరద కాలువ ద్వారా జళాశయంలోకి 2300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వుండగా ,జళాశయం హెడ్ రెగ్యులేటర్ ద్వారా 3310 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ నుండి 100 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్ ద్వారా 40 క్యూసెక్కుల చొప్పున మొత్తం 3450 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

**కావలి, అక్టోబర్ 23, ప్రభాతవార్త:** కావలి ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందడం జరిగింది. కావలి రైల్వే పోలీసుల సమాచారం మేరకు కావలి, తేట్టు రైల్వే స్టేషన్ల మధ్య దిగువ రైల్వే లైన్ లో సుమారు 60 నుండి 65 సంవత్సరముల మధ్య వయసు కలిగిన గుర్తు తెలియని మగ వ్యక్తి రైలు కిందపడి మృతి చెందడం జరిగిందని తెలియజేశారు. మృతుడు తెల్లని జుట్టు, గడ్డం కలిగి గోధుమ రంగు నిండు చేతుల చొక్కా పై బ్లూ కలర్ చేక్స్ డిజైన్ కలిగిన షర్టు, బులుగు రంగు లుంగి పై నలుపు రంగు పెట్టెలు కలిగిన లుంగీ ధరించి ఉన్నాడని చాక్లెట్ కలర్ టవల్ పై తెల్లని గీతలు కలిగి ఉన్నాయని తెలియజేశారు. సదరు వ్యక్తి ఆచూకీ తెలిపిన వారు కావలి రైల్వే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కేసును రైల్వే ఎస్సై కే. వెంకట్రావు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడిని గుర్తు పట్టినట్లయితే 9440627648 సెల్ నంబర్ కు తెలియజేయాలని కోరారు.

## షిరిడీ సాయి మందిరంలో అన్నదానం



**కోవూరు, అక్టోబరు 23ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారిలో వెలసి ఉన్న షిరిడీ సాయి మందిరంలో గురువారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్ స్వామి ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ ప్రాంగణంలో నిర్వహి ంచారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా దాసర రాజు–హిమవతి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. చుట్టుపక్కల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గిరిజన కాలనీలో దుప్పట్లు పంపిణీ



**సంగం అక్టోబర్ 23 ప్రభాతవార్త :** సంగం గిరిజన కాలనీలో ఉదయగిరి ఎంఈఇ తోట శ్రీనివాసులు తన తండ్రి తోట చిన్న పెంచలయ్య 25 వ వర్ధంతి సందర్భంగా పేదలకు అన్నదానం దుప్పట్లు పంపిణీ చేశారు .ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా నర్రవాడ బాబా గుడి చైర్మన్ బాలకృ ష్ణారెడ్డి హాజరైయ్యారు. ఆయన చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ తోట శ్రీనివాసులు మాట్లాడుతు ప్రతి సంవత్సరం తన తండ్రి జ్ఞాపకార్థం పేదలకోసం ఏదో ఒక కార్యక్రమాన్ని చేస్తుంటానని తెలిపారు. చల్లా యానది గిరిజన కాలనీలో పేద ప్రజలకు గ్రామానికి చెందిన పెద్దలు కూడా ఏదోఒక సహాయం చేయాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో పలువురున్నారు.

## రైతులకు యూరియా పంపిణీ



**వెంకటాచలం, అక్టోబరు 23, ప్రభాతవార్త:** వెంకటాచలం మండల కేంద్రం లో ఉన్న చౌటపాలెం పీఏసిఎస్‌లో గురువారం రైతులకు యూరియా మరియు కార్డులు పంపిణీ చేసిన పీఏసిఎస్ చైర్మన్ రావూరు రాధాకృష్ణమ నాయుడు. ఆయన మాట్లాడుతు సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గారు రైతుల పక్షిపాతి అని రైతుల సమస్యల మీద రాజి లేని పోరాటం చేస్తారని సర్వేపల్లి నియోజకవర్గ రైతులకు ఎనలేని కృషి చేస్తూన్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జున రెడ్డి. పీఏసిఎస్ డైరెక్టర్ ఆస్తోటి నాగరాజు. మండల వ్యవసాయ అధికారి హరికరుణాకర్ రెడ్డి. పీఏసిఎస్ సొసైటీ సిఈఓ జల్ది రవిచంద్ర. నాయకులు సండి రమేష్. బత్తల రఘురామయ్య. తురక రామ్ ప్రసాద్, సండి రమణయ్య, మొదలైన వారు పాల్గొన్నారు.

## పొంగిన మన్నేరు వాగు.. రెండు గ్రామాల మధ్య రాకపోకలు బంద్



**ఉలవపాడు, అక్టోబర్ 23, ప్రభాతవార్త :** అల్పపీడనం ప్రభావంతో పలు జిల్లాలలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఉలవ పాడు మండల పరిధిలో ఉన్న ఆత్మకూరు– మన్నేటికోట గ్రామాల మధ్య మన్నే రు వాగు బుధవారం రాత్రి నుండి పొంగి ంది. గత మూడు రోజుల నుంచి విస్తా ంగా వర్షాలు కురుస్తుండడంతో మన్నేరు కు ఎగువ నుంచి వరద నీరు పోటెత్తుతోంది. ప్రమాదకర స్థాయిలో నీరు ప్రవహిస్తోంది. దీంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ మన్నేరు వద్దకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఆ మార్గంలో రాకపోకలు సాగించకుండా కంచెలు ఏర్పాటు చేశారు. ఎస్సై అంకమ్మ స్పందించి మన్నేరు వద్ద సిబ్బందిని నియమించారు. మన్నేటిలో నీటి ఉధృతి తగ్గేవరకు ఈ మార్గంలో ప్రజలు రాకపోకలు సాగించవద్దని అధికారులు సూచించారు.

## ఉరుములు మెరుపులకు 33 కెవి లైన్ బ్రేక్ డౌన్



**బిట్రగుంట అక్టోబర్ 23 ప్రభాతవార్త:** బోగోలు మండలంలో గురువారం ఉరుములు, మెరుపుల తో కూడుకొన్న భారీ వర్షం కు బోగోలు టౌన్ ఫీడర్ కు సరఫరా అయ్యే విద్యుత్ 33 కేవీ లైన్ బ్రేక్ డౌన్ జరిగినట్లు ఏఈ జడరాయ తెలిపారు. అయితే విద్యుత్ సరఫరా కు అంతరాయము కలగకుండా ముంగమూరు సబ్స్టేషన్ నుండి ప్రత్యామ్నాయం గా విద్యుత్ ను అందించి అత్యవసరంగా మరమ్మత్తులు చేసినట్లు ఆయన తెలిపారు. భారీవర్షాలు, అల్పపీడనాలు వెళ్లేంతవరకు గ్రామాల్లో సిబ్బందిని అప్రమత్తం చేశామని వివరించారు.

## చేనేత కార్మికులను ఆదుకోండి



**నెల్లూరు అక్టోబర్ 23 ప్రభాతవార్త :** గత వారం రోజుల నుండి వర్షాలు కురుస్తుండడంతో చేనేత కార్మికుల మగ్గం గుంటల్లోకి నీళ్ళు చేరినందువల్ల చేనేత కార్మికులు మగ్గం నేసేందుకు వీలు లేకుండా పోయిందని ఈవారం పది రోజులు నుండి కార్మికులు భృతిని కోల్పవడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యా క్షులు పముజులహరి తెలిపారు. మగ్గం మీద ఉన్న చీర తయారు చీర,తయారు చేసే సామాగ్రి చెడిపోతే జీవో నెంబర్ 5 ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని అన్నారు. చేనేత కార్మికుడు 10 రోజుల నుండి భృతిని కోల్పోయారు కాబట్టి నష్ట పరిహారంగా 15 వేల రూపాయాలు ఇవ్వాల్సిందిగా ఆయన ప్రభుత్వాన్ని కోరారు. గత సంవత్సరం తుఫాన్ కారణంగా మంగళగిరిలో విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ చేనేత కార్మికులకు 25 వేల రూపాయాలు నష్ట పరిహారం ఇవ్వడం జరిగిందని అన్నారు. ఆదరణ పథకాన్ని పునరుద్దించాలని కోరుతున్నట్లు తెలిపారు. అట్లాగే రాజీవ్ విద్యామిషన్ పథకాన్ని అమలు చేయాలని,చేనేత వస్త్రములపై ఉన్న జీఎస్‌టిని పూర్తిగా రద్దు చేయాలని కోరారు. కోనసీమ జిల్లాలోని కపిలేశ్వరపురం మండలంలోని అంగర చేనేత సహకార సొసైటీలో 1600 మంది సభ్యులు ఉండగా ఈ సొసైటీకి మూడు కోట్లా 80 లక్షల రూపాయాలు ప్రభుత్వం నుండి బకాయిలు రావలసి ఉండగా ఆ సొసైటీ వాళ్ళు ఇటీవలే 14 రోజుల రిలే నిరాహార దీక్షలు చేస్తుంటే ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన రాలేదు దీని వలన కోనసీమ జిల్లాలో చేనేత కార్మికులందరు నష్టపోవడం జరిగింది. ప్రభుత్వం స్పందించి అంగర చేనేత సహకార సంఘం సొసైటీకి మూడు కోట్లా 80 లక్షల రూపాయాలు వడ్డీతోపాటు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

## పాతాళపల్లిలో కోటి సంతకాల సేకరణ



**అనంతసాగరం, అక్టోబరు 23, ప్రభాతవార్త :** మండలంలోని పాతాళపల్లి లో వైసిపి మండల కన్వీనర్ బిజివేముల పిచ్చిరెడ్డి ఆధ్వర్యంలో గురు వారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కన్వీనర్ మాటా ్లడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రవేటీ కరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్‌సిపి అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా సంతకాలను సేకరించామన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**ఆత్మకూరు, అక్టోబరు 23, ప్రభాతవార్త :** బంగాళాఖాతంలో వాయుగుండం బలపడుతున్న దృష్ట్యా రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆత్మకూరు నియోజకవర్గంలోని ప్రజలం దరూ అప్రమత్తంగా ఉండఆలని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగి పలు ప్రాంతాల్లోని లో లెవల్ బ్రిడ్జలపై నీరు ప్రవహిస్తున్న దృష్ట్యా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న అధికారుల సూచనలను పాటించా లన్నారు. వాతావరణ శాఖ నెల్లూరుజిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్య ంలో బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ప్రజలు తమకు ఏమైనా సమస్యలు ఎదురైతే అధికారులకు తక్షణ సమాచారం ఇవ్వాలన్నారు. సోమశిల జలాశయానికి వస్తున్న వరద ప్రవాహం క్రమేపి పెరుగుతున్న నేపథ్యంలో జలాశయం నుంచి నీటి విడుదలను అధికారులు పెంచుతున్నారని పెన్నా పరివాహక ప్రాంతాల్లోని గ్రామాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవనశాఖ, విద్యుత్, పోలీసు శాఖల అధికారులు ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## వరద నీరు నిల్వకుండా చర్యలు



**నెల్లూరు రూరల్, అక్టోబర్ 23, ప్రభాతవార్త :** భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ప్రధాన రహదారులపై నిలిచిపోయిన వర్షపు నీటిని తొలగించి శాశ్వత పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సూచించారు. నేటి ఉదయం నెల్లూరు నుండి పొట్టేపాళెం వెళ్లే ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిల్వకుండా తగిన చర్యలు తీసుకునేందుకు నెల్లూరు రూరల్ మండల ఎంపీడీవో, మున్సిపల్ కార్పొరేషన్, ఆర్అండ్‌బి శాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలన చేశారు. నెల్లూరు శ్రీఇరుకళల పరమేశ్వరి అమ్మదేవస్థానం నుండి పొట్టేపాళెం వరకు వెళ్లే ప్రధాన రహదారిపై ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గమనించిన గిరిధర్‌రెడ్డి, వెంటనే అధికారులతో మాట్లాడి నీటిని త్వరితగతిన తొలగించాలంటూ సూచించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రజల ఇబ్బందులు తక్షణమే తీర్చేలా వర్షాకాలంలో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా ఇంజనీరింగ్ విభాగం సమగ్రంగా పరిశీలించి ప్రణాళికలు రూపొందించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, నగర మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, టీడీపీ నాయకులు ఇందుపూరు అచ్యుత్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఇన్‌చార్జి చాట్ల చక్రవర్ధన్‌రెడ్డి, ఆర్అండ్‌బి డీఈ, మున్సిపల్ కార్పొరేషన్ ఈఈ, డీఈ, ఏఈ, పొట్టేపాళెం పంచాయతీ సెక్రటరీ, వీఆర్ఓ, కో క్లస్టర్ విష్ణు ప్రియ, 41వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు ఉచ్చురు సురేష్, టీడీపీ నాయకులు పూల సుబ్రహ్మణ్యం, సుతారం సురేష్, శివశేషాద్రి, కమలాకర్, గఫోర్, ఫిరోజ్, అద్దంకి కృష్ణ, కేపీఎన్ ప్రసాద్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## పంగిలి గ్రామానికి కాలినడకన వెల్లేందుకు ఏర్పాట్లు చేసిన అధికారులు



**రాపూరు,అక్టోబరు23ప్రభాతవార్త :** మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రాపూరు నుండి పంగిలికి వేల్లే కొండేరు వాగు బ్రిడ్జి డైవర్షన్ రోడ్డు కొట్టుకోని పోయి పంగిలి గ్రామానికి రాకపోకులు నిలిచిపోయిన విషయం తెలిసిందే. అయితే విషయం తెలుసుకున్న రాపూరు తహశిల్దార్ లక్ష్మీనరసింహం గ్రామానికి వెల్లేందుకు ప్రత్యామ్నాయం చూడాలని ఇంజనీరింగ్ అధికారులను కోరారు. దీంతో ఇంజనీరింగ్ అధికారులు గ్రామంలోకి ప్రజలు కాలినడకన వేల్లందుకు నిర్మాణంలో వున్న బ్రిడ్జిపై చెక్కలను ఏర్పాటు చేశారు. దీంతో పాటు వంతెన నిర్మాణంలో పెండింగ్‌లో వున్న రెండు బాగాలలో ఒక దానికి స్లాబ్ వేసేందుకు యుద్ద ప్రదిపాదికన చర్యలు చేపడుతున్నారు.

## జొన్నవాడ కామాక్షితాయి ఆలయం తళియా అర్చక స్వామి మృతి



**బుచ్చి అక్టోబర్ 23 ప్రభాతవార్త :** ఏన్నో ఏళ్ళుగా పవిత్ర ్పుణ్యక్షేత్ర మైన జొన్నవాడలోని శ్రీమల్లి కార్జున ్స్వామి కామాక్షితాయి దేవస్తానంలో వంటశాలలో ప్రసా దాలు తయారు చేసే తళియ అర్చక స్వామి పారా గురుమూర్తి (48) బుధ వారం నెల్లూరులోని ఆయన స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. విష యం తెలుసుకొని ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి,ఆలయ ఇఒ ఆర్వభూమి శ్రీనివాసులురెడ్డి విచారం వ్యక్తం చేశారు. అలాగే దేవస్దానం అర్చకులు విషాద ్ంలో మునిగి పోయారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## వర్షాకాలంలో పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి



**కోవూరు, అక్టోబరు 23ప్రభాతవార్త :** కోవూరు పశు సంవర్ధక శాఖ సబ్ డివిజన్ పరిధిలో కోవూరు, విడవలూరు మండలాలకు సంబంధించిన పాడి రైతులు ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలకు గానూ పాడి పశువుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోవూరు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, పర్యవేక్షణాధికారి డాక్టర్ కృష్ణమౌర్య తెలిపారు. కోవూరులోని పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలకు సబ్ డివిజన్ పరిధిలోని రెండు మండలాలకు నాలుగు పర్యవేక్షక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో నలుగురు పశు వైద్యులు ఉంటారన్నారు. అదేవిధంగా సంబంధిత గ్రామాల పశు సహాయకులు వర్షాలు తగ్గేవరకు హెడ్ క్వార్టర్‌లోనే ఉండి పాడి రైతులకు తగు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం గొంతు వాపు వ్యాధి నివారణకు గానూ వ్యాధి నివారణ టీకాలు కూడా అవసరమైన పశువులకు వేయాలన్నారు. అదేవిధంగా ప్రస్తుతం అకాల వర్షాల కారణంగా గొర్రెలు, మేకలను సాధ్యమైనంత వరకు బయటకు రాకుండా సంబంధిత రైతులు తగు జాగ్రత్తలు తీసుకునేలా వారిలో అవగాహన కల్పించాలన్నారు. నెల్లూరులోని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో అకాల వర్షాలకు గానూ ప్రత్యేక టోల్‌ఫ్రీ కార్యాలయం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అవసరమైన రైతులు ఈ సేవలు కూడా వినియోగించుకోవాలన్నారు.

## నాగవరపమ్మ దేవస్థానంలో ప్రారంభమైన అన్నదానం



**కోవూరు, అక్టోబరు 23ప్రభాతవార్త :** కోవూరులోని గ్రామ దేవత శ్రీ నాగవరపమ్మ దేవస్థానంలో హరి హ రపుత్ర సమాజం ఆధ్వ ర్యం లో గత 20 సంవత్సరాలుగా మా లలు వేసుకున్న అయ్యప్పలకు కార్తీకమా సం పూర్తయ్యేంత వరకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వాహ కులు మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తూనే ఉన్నా రు. ప్రస్తుతం కార్తీక మాసం ప్రారంభం అయిన నేపథ్యంలో గురువారం సైతం ఈ ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు శ్రీనివాసులు, న్యాయవాది ప్రసాద్, తదితరులు ఉన్నారు.

## రైలుపట్టాల పైన గుర్తు తెలియని మృతదేహం

**బిట్రగుంట అక్టోబర్ 23 ప్రభాతవార్త:**విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో కావలి తెట్టు రైల్వే స్టేషన్ మధ్య కేఎం నెం:226/4-6 పోస్టుల మధ్య దిగువ లైన్ లో సుమారు 60 నుంచి 65 సంవత్సరముల వయస్సు కలిగిన గుర్తు తెలియని మగ వ్యక్తి రైలు కిందపడి మరణించడం జరిగిందని రైల్వే పోలీసులు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి తెల్లని జుట్టు, గడ్డం కలిగి ఉన్నాడని. గోధుమ రంగు నిండు చేతుల చొక్కాపై బ్లూ కలర్ చెక్స్ డిజైన్ కలిగిన షర్టు మరియు బులుగు రంగు లుంగి పై నలుపు రంగు పెట్టెలు కలిగిన లుంగీ, చాక్లెట్ కలర్ టవల్ పై తెల్లని గీతలు కలిగినవి ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. మృతుని ఆచూకీ తెలిసినవారు కావలి రైల్వే పోలీసులను సంప్రదించాలని కేసు నమోదు చేసుకొని కావలి రైల్వే ఎస్సై కే వెంకట్రావు దర్యాప్తు చేస్తున్నారు.

## పిల్లా పేరు వాగులో రాకపోకలు నిలిపివేత



**వరికుంటపాడు, అక్టోబర్ 23, ప్రభాతవార్త :** వర్షాల ప్రభావంతో మండలంలోని కనీయంపాడు వద్ద పిల్లా పేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆ మార్గం గుండా రాకపోకలు నిలిపివేసినట్లు తహసీల్దార్ పసుపులేటి హేమంత్ కుమార్, ఎస్సై రఘునాథ్‌లు తెలిపారు. గురువారం పిల్లా పేరు వాగును తహసీ ల్దార్ హేమంత్ కుమార్, ఎస్సై రఘునాథ్ పరిశీ లించి, ఆ మార్గం గుండా ప్రయాణాలు సాగించ్కుం డా చర్యలు చేపట్టారు. ముందస్తు సమాచారం తెలిసేలా అక్కడ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అలాగే రెవెన్యూ సిబ్బంది, పోలీసు సిబ్బందితో పహారా ఏర్పాటు చేశారు.ఆమార్గం గుండా రామదేవులపాడుకు వాహనాలు కానీ మనుషులు కానీ వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. ప్రజల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వీఆర్వో లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నేరెళ్ళవాగులో వ్యక్తి గల్లంతు...వాగువద్దకు చేరుకున్న అదికారులు గాలింపు చర్యలతో మృతదేహం లభ్యం



**జలదంకి,, అక్టోబరు 23, ప్రభాతవార్త :** జలదంకి మండలం చామదల నేరెళ్ళవాగులో గ్రామానికి చెందిన దంపూరి మల్లికార్జున (45) గురువారం గల్లంతయ్యాడు.గ్రామస్తుల కదనం మేరకు మల్లికార్జున ప్రతిరోజు కావలికి కూలిప నులకై వెళుతుంటాడు.ఆక్రమంలో ఉదయం తనకు చెందిన బైక్‌పై కిలోమీటరు దూరంలోవున్న వాగువద్దకు చేరుకున్నాడు.అసమయంలో వాగు చప్టాపై కొద్దిపాటి నీరుపారుతుంది.దీంతో దాటిపోవచ్చులే అనుకొని బైక్‌ను కొద్దిదూరం పోనిచ్చాడు.అయితే ఏమైందో ఏమోకాని ఒక్కసారిగ బైక్ అదుపుతప్పి చప్టాపైనుంచి వాగులోకి కొట్టుకుపోయాడు.గమనిస్తున్న కొంతమంది రక్షించే ప్రయత్నం చేశారు.అయితే వారి ప్రయత్నం విఫలమైంది.మల్లికార్జున గల్లంతైన విషయం గ్రామంలో దావనంలా వ్యాపించింది.అందరు పరుగున వాగువద్దకు చేరుకున్నారు.అదికారులకు సమాచారమం దించారు. తహసిల్‌దార్ ప్రమీల,ఎంపిడిఒ బ్రహ్మయ్య,ఎస్ఐ లతీవున్నీషలు వాగువద్దకు చేరుకున్నారు.సంఘటనపై ఆరాతీశారు.కొందరు గ్రామ యువకులు తాము గాలిస్తామని అదికారులకు తెలియజేశారు.అయితే అందుకు వారు ససేమిరా అన్నారు.పోలీసు సిబ్బంది కొంత గాలించిన లాభంలేకపోయింది.రిస్క్యూ టీమ్‌ను రప్పించారు.టీమ్‌సాయంతొ పోలీసులు సంయుక్తంగ గాలించారు.ఎట్టకేలకు మద్యాహ్నంవేళ మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకు చేర్చారు.పోస్ట్‌మార్టమ్ నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.కాగా కుటుంభ యజమాని అకాల మృత్యువాత పడడంతో భార్య,పాపతో పాటు బందువర్గాలు కన్నీరుమున్నీ రయ్యారు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

**- నిరాహార దీక్షకు స్పందించిన విద్యుత్ అధికారులు:**

రామిరెడ్డి కృష్ణారెడ్డి చేపట్టిన నిరాహారదీక్షకు వెంటనే స్పందించిన ట్రాన్స్ కో అధికారులైన ఏడిఈ రవీంద్రారెడ్డి, పట్టణ ఏఈలు నాగేంద్ర బాబు, వసంతరావు, కమర్షియల్ ఏఈ వెంకటస్వామిలు దీక్ష శిబిరానికి విచ్చేసి రామిరెడ్డి కృష్ణారెడ్డి చేపట్టిన పనులకు సంబంధించిన ఎల్ఓసిని వేయించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అనంతరం రామిరెడ్డి కృష్ణారెడ్డికి వారు పళ్ళ రసాన్ని ఇచ్చి దీక్షను విరమింపచేశారు.

## నేడే డయల్ యువర్ ఆర్టీసీ డియం



**కావలి, అక్టోబర్ 23, ప్రభాతవార్త:**నేడు ఉదయం 12 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు డయల్ యువర్ డియం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీయస్ ఆర్టీసీ కావలి డిపో మేనేజర్ డి.ఆదినారాయణ గురువారం తెలియజేశారు. ఈ సంద ్భంగా ఆయన మాట్లాడారు ప్రజలు ప్రయాణికులు తమ సమస్యలు , సూచనలు 9959225643 నంబర్ కు ఫోన్ చేసి తెలపాలని వీలైన అన్ని సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు.గత డయల్ యువర్ డియం కార్యక్ర మాలలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను దాదాపు అన్నింటిని పరిష్కరించామని ఆయన వివరించారు.తమ డిపో పరిధిలోని కావలి,జలదంకి ,కలిగిరి,బోగోలు,కొండాపురం, దగదర్తి ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

- కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక బస్సులు ఏర్పాటు కార్తీక మాసం సందర్భంగా కావలి డిపో నుండి అరుణాచలంకు ఈనెల 26 తేదీ మరియు నవంబర్ నెల 4, 9, 16 తేదీలలో, శ్రీశైలంకు ఈనెల 26వ తేదీ మరియు నవంబర్ నెలలో 2,9, 16 తేదీలలో, పంచారామాలకు నవంబర్ 2,9 వతేదీల్లో ప్రత్యేక బస్సులు కావలి డిపో నుండి నడుపుతున్నట్లు డిపో మేనేజర్ డి ఆదినారాయణ తెలిపారు.కావున శ్రీశైలం, అరుణాచలం, పంచారామాలకు వెళ్ళదలచిన భక్తులు కావలి ఆర్టీసీ బస్టాండ్ నందు సంప్రదించి రిజర్వేషన్ చేసుకోవాలని,ఆన్లైన్ రిజర్వేషన్ కూడా అందుబాటులో ఉన్నదని తెలిపారు. ఇతర వివరాలకు 7382926413 (విచారణ ), 9493913989 ( బస్టేషన్ మేనేజర్ ),9966009395 (అసిస్టెంట్ మేనేజర్ ( ట్రాఫిక్ ) ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## ఆర్టీసీ బస్సును ఢీకున్న ప్రవేటు బస్సు



**మనుబోలు అక్టోబర్ 23 ప్రభతవార్త :** మనుబోలు జాతీయ రహదారిపై పశు వులు ఆవులు విచ్చల విడిగా తిం్గడం వాటి యజమానులు ,కాపలా దారులు ఎవ్వరు ఉండకపోవడంతో అనేక ప్రమా దాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్లపై వెళు తున్న వాహనాలకు అడ్డు వస్తు న్నాయి. గురువారం తిరుపతి నుండి ఆత్మకూరు వెళుతున్న ఏపిఎస్ ఆర్టీసి బస్సుకు కొండూరు సత్రం వద్ద ఆవులు అడ్డురావడంతో డ్రైవర్ హఠాత్తుగా బ్రేక్ వేయగా వెనుక వేగంగా వస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆర్టీసి బస్సును వెనుకభాగంలో ఢీకొట్టింది. అదృష్టవశాత్తు బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎవ్వరికి ఏమి కాకపోవడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్దలానికి చేరుకొని ట్రాఫిక్‌ను నియంత్రించారు.

## పలువురికి భోజనం వితరణ



**కావలి, అక్టోబర్ 23, ప్రభాతవార్త:**ఇటీవల కురిసిన వర్షానికి కొట్టుమిట్టాడుతున్న ప్రజలకి మేమున్నామంటూ కావలి రూరల్ మండలం తుమ్మలపెంట గ్రామానికి చెందిన వాయలు బాలకృష్ణ బృందం ఆధ్వర్యంలో గురువారం కావలి రూరల్ మండలం తాళ్లపాలెం ఆదరణ కేంద్రంలోని 20 మంది అనాథలకు, ముంగుమూరు క్రాస్ రోడ్డు వద్ద ఉన్న భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ లో ఉన్నటువంటి 40 మంది పేషంట్లకు, కావలి పెంకులు ఫ్యాక్టరీ సంఘంలో ఉన్నటువంటి ప్రజలకు మొత్తం 150 మందికి అన్నదాన వితరణ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా వాయిల బాలకృష్ణ బృందాన్ని పలువురు అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకట్రావు, రామ్మోహన్, రాము, చైతన్య, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## పునరావస కేంద్రంలో భోజనాలు ఏర్పాటు



**కోవూరు, అక్టోబరు 23ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు పంచా యతీ పరిధిలోని అట్ల కాలనీలో గత వారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఆ ప్రాంతంలో ఉన్న నిరుపేద గిరిజన కుటుంబాలు కూలి పనులు లేక ఇబ్బం దులకు గురయ్యారు. ఈ మేరకు స్థానిక వీఆర్‌వో హరికృష్ణ ఇచ్చిన సమాచారం మేరకు కోవూరు తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య జిల్లా ఉన్నతాధికారుల ఆదే శాల మేరకు గిరిజనులలను ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పునరావస కేంద్రం ఏర్పాటు చేసి వారికి భోజన సదుపాయం ఏర్పాటు చేసేలా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. దీంతో అట్ల కాలనీ గిరిజనులు తహసీల్దార్ సుబ్బయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## డెవలప్‌మెంట్ చార్జీల సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి



కోవూరు, అక్టోబరు 23ప్రభాతవార్త : కోవూరు ట్రాన్స్‌కో సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు 50 శాతం సబ్సిడీ ఇస్తున్న డెవలప్‌మెంట్ చార్జీలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రమేష్ చౌదరి అన్నారు. కోవూరులోని ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఈ సబ్సిడీ డిసెంబర్ 31 తేది వరకు కొనసాగుతుందన్నారు. ఈ లోగా విద్యుత్ వినియోగం ఎక్కువ చేస్తున్న వినియోగదారులు ఈ మంచి అవకాశాన్ని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. అదేవిధంగా ఇప్పటివరకు డివిజన్ పరిధిలో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద 502 మందికి సౌర పలకలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారుసోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం కూడా సబ్సిడీ నిధులు అందజేస్తుందన్నారు. దీనిని ఏర్పాటు చేసుకోవడం వలన వినియోగదారుడు బిల్లుల్లో పూర్తిగా కట్టవలసిన అమౌంట్ తగ్గి తిరిగి వినియోగదారునికే నిధులు మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ పథకంపై విద్యుత్ వినియోగదారులు అవగాహన చేసుకుని ఏర్పాటు చేసుకోవాలన్నారు. . డివిజన్ పరిధిలోని 8 ప్రాంతాల్లో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో విద్యుత్ వినియోగదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తడి చేతులతో స్విచ్‌లు వేయడం. స్తంభాలు తాకడం వంటి పనులు చేయవద్దని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఎక్కడైనా విద్యుత్ అంతరాయం జరిగితే వెంటనే సమీపంలో ఉన్న సబ్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చి విద్యుత్‌ను పునరుద్దరించుకోవాలన్నారు.

## ట్రాన్స్ కో సీఎండి న్యాయం చేయకపోతే అసెంబ్లీ ముందు నిరాహార దీక్షకు సిద్ధం



**కావలి, అక్టోబర్ 23, ప్రభాతవార్త:** ట్రాన్స్ కో సీఎండి ఈ నెలాఖరు కల్లా న్యాయంచేయకపోతే అమరావతి అసెంబ్లీ ముందు నిరాహార దీక్ష చేసేందుకు సిద్ధంగా ఉన్నానని కావలి పట్టణానికి చెందిన ఏపీ ట్రాన్స్ కో కాంట్రాక్టర్ రామిరెడ్డి కృష్ణారెడ్డి తెలియజేశారు. కావలి పట్టణంలోని విద్యుత్ కార్యాలయంవద్ద రామిరెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గురువారం లేబర్ ఎలక్ట్రికల్ బిల్లులకు ఎల్ ఓ సి వేయకపోవడంతో నిరాహార దీక్ష ను చేపట్టడం జరిగింది. ఆయనకు పలువురు పూలమాలలు వేసి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు గత కొన్ని సంవత్సరాలుగా ట్రాన్స్ కో కాంట్రాక్టర్ గా ఉంటూ కావలి డివిజన్ లో విపత్తుల సంభవించినప్పుడు ఎక్కడైనా విద్యుత్ పోల్స్ విరిగిపోయినప్పుడు లేదా పడిపోయినప్పుడు విద్యుత్ పోల్స్ ను నిలుపుదల చేసే పనులు చేస్తూ ఉన్నామని తెలియజేశారు. కావలి డివిజన్లో పనులు చేసిన బిల్లులు డివిజనల్ కార్యాలయంకు వస్తే బిల్లులకు ఎల్ వో సి వేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని తెలియజేశారు.కావలి డివిజన్లో కొన్ని మండలాల్లో పనులు ఇవ్వకుండా విద్యుత్ అధికారులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రం లోటు బడ్జెట్ లోఉన్న కూడా ఏపీ ట్రాన్స్పోర్ట్ లో మాత్రం సంపన్న వర్గాల వారికి ఎక్కువ రేట్లకు టెండర్లు కేటాయిస్తున్నారని తెలియజేశారు. మాలాంటి చిన్న కాంట్రాక్టర్లు తక్కువ రేట్లకు పనులు చేస్తామన్న పనులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ రేటుకు పనులు చేస్తున్న మాలాంటి చిన్న కాంట్రాక్టర్లకు పనులు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం కూడా పెరుగుతుందని తెలియజేశారు. లేనిపక్షంలో టెండర్ల ద్వారా పిలిస్తే తక్కువ రేట్లతో టెండర్లను వేసి పనులను దక్కించుకుంటామని తెలియజేశారు.

## బిఎస్ఎన్ఎల్ ఉచిత సేవలను సద్వినియోగం పరుచుకోవాలి



**కావలి, అక్టోబర్ 23, ప్రభాతవార్త:** బిఎస్ఎన్ఎల్ ఉచిత సేవలను ప్రజలు సద్వినియో గపరు చుకోవాలని జిల్లా టెలికం అడ్వైజర్ కమిటీ సభ్యులు కుట్టుబోయిన బ్రహ్మానందం కోరారు. కావలి పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం నందు గురువారం సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యులు కుట్టు బోయిన బ్రహ్మానందం పాల్గొని మాట్లాడారు. బిఎస్ఎన్ఎల్ ఒక రూపాయికే బిఎస్ఎన్ఎల్ సిమ్ కార్డ్ మరియు ఈసిమ్ కార్డ్ అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. కావలి పరిసర ప్రాంతాల్లో బిఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ కనెక్షన్ ను ఉచితంగా ఇన్స్టాల్ చేయడం జరుగుతుందని తెలియజేశారు. కావలి డివిజన్ పరిధిలో బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ మెరుగు కోసం విరివిగా టవర్లను ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేస్తున్నమని తెలిపారు. మరో ఏడాదిలో 5జి నెట్వర్క్ పూర్తిగా అందుబాటులోకి వస్తుందని తెలియజేశారు. బిఎస్ఎన్ఎల్ అధిక లాభాల్లో పయనిస్తుందని, వినియోగదారులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి మంచి సేవలను అందిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ డిఇ సాయిరాం మాట్లాడారు బిఎస్ఎన్ఎల్ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. బిఎస్ఎన్ఎల్ ఉచిత సేవలను వినియోగదారులు ఉపయోగించుకోవాలని కోరారు. దీపావళి ధమాకా ఆఫర్ ను ప్రజలు సద్వినియోగం చేసుకొని లబ్ది పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ జెటిఓ భాష,ప్రసాద్ ఎస్డిఈ ప్రభాకర్,బిజెపి ఒకటవ పట్టణ అధ్యక్షులు మంద కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి గుడిపల్లి ప్రసన్నకుమార్, వల్లేపు తిరుపతయ్య, దేవుండ్ల రాకేష్, మేదరమెట్ల మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

## పెరిగిన ఆలయ భూముల కౌలు వేలం 1,03,700రూపాయలు ఆదాయం



**కోవూరు, అక్టోబరు 23ప్రభాతవార్త :** కోవూరు మండలం మోడెగుంట గ్రామ ంలో వెలసి ఉన్న శ్రీ నాగేశ్వర స్వామి వారి దేవస్థానంలో గురువారం దేవస్థా నానికి సంబంధించిన కౌలు భూములకు బహిరంగ వేలంపాటను ఆలయ కార్యని ర్వాహణ అధికారి కృర్ష్ణప్రసాద్, దేవాదా య ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రాజు పర్యవేక్షణలో నిర్వహించారు. మొత్తం ఈ దేవస్థానానికి సంబంధించిన 13 ఎకరాలకు గురువారం నిర్వహి ంచిన బహిరంగ వేలంపాటలో రైతులు ఉత్సాహంగా పాల్గొని కౌలు భూములను కౌవసం చేసుకు న్నారు. గతంలో ఈ మొత్తం భూములకు 2,11,300 రూపాయలు కౌలు రాగా.. ప్రస్తుతం గురువారం నిర్వహించిన బహిరంగ వేలంపాటలో 3,15,000లకు పెరిగింది. దీంతో దేవస్థానానికి 1,03,700 రూపా యలు ఆదాయం పెరిగింది. ఈ కార్యక్రమంలో ఆ గ్రామానికి సంబంధించిన రైతులు, తదితరులు ఉన్నారు.

## దర్శిగుంట జన్మదిన సందర్భంగా పలుసేవా కార్యక్రమాలు





**కావలి, అక్టోబర్ 23, ప్రభాతవార్త:**డిపిఎం ట్రేడర్స్ అధినేత దర్శగుంట మహేంద్ర జన్మదిన వేడుకలు గురువారం ప్రియ మిత్రుడు ఆత్మకూరు సంజయ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసిఘనంగా జరుపుకోవడం జరిగింది.ఈ సందర్భంగా కావలి పట్టణంలో దర్శగుంట మిత్రబృందం పలు సేవా కార్యక్రమాలను చేపట్టడం జరిగింది.అన్న క్యాంటీన్ నందు400 మంది పేదలకు అన్నదానం, కావలి ఏరియా వైద్యశాల లోని రోగులకు పండ్లు,రొట్టెలు పంపిణీ, రైల్వే స్టేషన్, పట్టణంలోని పలుచోట్ల ఉండే యాచకులకు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు దర్శకుంట మహేంద్రను దుశ్శాలవాలతో పూలమాలలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం దర్శికుంట మహేంద్ర మాట్లాడారు తన జన్మదినం సందర్భంగా తన వంతు పేద ప్రజలకు సహాయం చేయాలనే ఉద్దేశంతో అందులోనూ వర్షాకాలం అయినందున పేద ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నందున పలు సేవా కార్యక్రమలను చేపట్టడం జరిగిందని తెలియజేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను భగవంతుని ఆశీస్సులతో రానున్న రోజుల్లో కూడా చేపట్టడం జరిగిందని తెలియజేశారు. నాకు సహాయ సహకారాలు అందించిన మిత్రులకు ధన్యవాదాలు తెలియజేశారు. మహేంద్ర సేవాభావాన్ని పట్టణ ప్రజలు అభినందించడం జరిగింది.

## వైసిపి నేత పెంచలరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ప్రసన్న



**బుచ్చి అక్టోబర్ 23 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలం సాల్మాన్ పురం గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు మారంరెడ్డి పెంచలరెడ్డి ఇటీవల మృతి చెందడంతో వైసిపి రాష్ట్ర వైసిపి పిఎసి సభ్యులు నల్లపరెడ్డిప్రసన్నకుమార్‌రెడ్డి సాల్మాన్ పురంకి వచ్చి వారి స్వగృహని వెళ్ళి ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆప్కాప్ మాజీ చైర్మన్ కోవూరు నియోజకర్గం పరిశీలకులు కొందూరు అనీల్‌బాబు, బుచ్చిరూరల్ మండల పార్టీ అద్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి, స్దానిక వైసిపినాయకులున్నారు.

## మెట్ల ర్యాంపుల నిర్మాణాలు తొలగింపు





**నెల్లూరు కార్పొరేషన్, అక్టోబర్ 23, ప్రభాతవార్త:** స్థానిక సండే మార్కెట్ ప్రాంతంలో సుబ్రహ్మణ్య స్వామి దేవాలయం సమీపంలో రోడ్డుపై నిలిచి ఉన్న వర్షపు నీరు రైలు కాలువల ద్వారా సాఫీగా ప్రవహించేందుకు అవసరమైన మెట్లు, ర్యాంపుల నిర్మాణాలను తొలగించాలన్న కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశాల మేరకు సంబంధిత విభాగ టౌన్ ప్లానింగ్ సిబ్బంది బుధవారం రాత్రి నుంచి ఆక్రమణల తొలగింపు పనులను చేపట్టారు. ఆక్రమణల తొలగింపు పనులను కమిషనర్ గురువారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షపు నీరు రోడ్డుపై నిలవకుండా అవసరమైన అన్ని చర్యలను వేగవంతం చేయాలని, వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం, శానిటేషన్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శైవ క్షేత్రాల దర్శనకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



**నెల్లూరు, అక్టోబరు23 ప్రభాతవార్త -విద్య** పవిత్ర కార్తీక మాసాన్ని పుస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం మన రాష్ట్రంతోపాటూ తమిళనాడులోని ప్రసిద్ధ శైవ క్షేత్రాల దర్శనకు తమ సంస్థ ప్రత్యేక బస్సులనునడుపుతుందని ఆర్టీసీ వన్‌డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం నగరంలోని స్థానిక ఆర్టీసీ ప్రధాన బస్టాండులోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. డిపో మేనేజర్ మాట్లాడుతు ఈ ప్యాకేజీ టూర్స్‌లో భాగంగా పంచారామ క్షేత్ర దర్శిని పేరుతో అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షా రామం, సామర్లకోట లోన్ని శైవక్షేత్రాలను దర్శించటం జరుగుతుందన్నారు. సూపర్‌లగ్జరీ బస్సులో ఈ యాత్ర చేయగోరు భక్తులు రూ.2500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే త్రిలింగ క్షేత్ర దర్శిని పేరుతో యాగంటి, మహానంది, శ్రీశైలంలోని శైవక్షేత్రాల దర్శన చేయటం జరగుతుందన్నారు. సూ పర్‌లగ్జరీ బస్సులో ఈ యాత్ర చేయగోరు భక్తులు ఒక్కొక్కరికి రూ.1800 చెల్లించాల్సి ఉంటుందన్నారు. తమిళనాడులోని అరుణాచల దర్శనం చేయగోరు భక్తుల సౌకర్యార్థం 1200 రూపాయలకు సూపర్ లగ్జరీ బస్సులను నడిపేందుకు ఆర్టీసీ చర్యలు తీసుకుందన్నారు. ఈ ప్రత్యేక ప్యాకేజీబస్సులు 25,26,నవంబరు 1,2,4, 7,8 ,9,15,16 తేదీల్లో నగరంలోని ప్రధాన ఆర్టీసీబస్టాండునుండి బయలుదేరుతాయని, యాత్రచేయదలచిన వారు ముందుగా వారి వారి సీట్లను రిజర్వేషన్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 0861-2323333, 9959225653, 9492192238 నెంబర్లకుకాల్ చేయాలని ఆయనకోరారు. శైవక్షేత్రాల దర్శనా నికి సంబందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. నెల్లూరు వన్‌డిపో సిఐ సునీత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కోనలో కనువిందు చేస్తున్న లోకోన జలపాతం

### ..తిలకించేందుకు పెద్ద ఎత్తున పర్యాటకులు,భక్తులు



**పెంచలకోన(రాపూరు), అక్టోబరు23ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని లోకోన జలపాతం భారీ వర్షాలతో కొండ పైనుండి కిందకు పరవళ్ళు తొక్కుతూ వస్తూ కనువిందు చేస్తుంది. దీంతో జిల్లా నుండే కాక ఇతర ప్రాంతాల నుండి కూడా పెద్ద ఎత్తున పర్యాటకులు జలపాతాన్ని తిలకించేందుకు కోనకు చేరుకుంటున్నారు. అయితేనీటి ప్రవాహంఎక్కువగా వుండటంతో పోలీసు,రెవెన్యూ,అటవీశాఖ,దేవాదాయ శాఖాధికారులు అక్క డికి వెల్లేందుకు అనుమతిఇవ్వడంలేదు.దీంతో కోనకు వచ్చిన పర్యాటకులు లోకోన నుండి ప్రవహిస్తున్న కణ్వలేరులో మునుగుతూ పరవశించి పోతున్నారు.

## కలెక్టరేట్లో కారుణ్య నియామకం



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 23, ప్రభాతవార్త** కారుణ్య నియామక ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అందించారు. గురువారం కలెక్టర్ వారి చాంబర్‌లో షేక్ సంషీర్ అనే యువకుడిని సహకార శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమిస్తూ కలెక్టర్ కారుణ్య నియామక ఉత్తర్వులను అందించారు. సంషీర్ తండ్రి చాన్ బాష ఇరిగేషన్ శాఖలో మ్యాన్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తూ మరణించడంతో, కారుణ్య నియామకం ద్వారా సంషీర్‌కు ప్రభుత్వ ఉద్యోగాన్ని కలెక్టర్ కేటాయించారు. విధుల పట్ల అంకితభావంతో ఉద్యోగబాధ్యతలను నిర్వర్తించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.

## దగదర్తి పీఏసీ చైర్మన్‌గా బొలిగర్ల

**దగదర్తి, అక్టోబర్ 23, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆశీస్సులతో దగదర్తి పీఏసీ చైర్మన్‌గా సీనియర్ రాజకీయ నాయకులు, మాజీ తహసీల్దార్ బొలిగర్ల వెంకటరత్నంని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యులుగా చేజర్ల ప్రభాకర్‌రెడ్డి, చేజర్ల ఇబ్రిన్ ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు, సభ్యులు వారి ఎన్నికకు సహకరించిన శాసనసభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం ప్రజల కోసం కష్టపడి పని చేయాలని వారికి సూచించారు. వారి ఎన్నికపై దగదర్తి టీడీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు



**దగదర్తి, అక్టోబర్ 23, ప్రభాతవార్త** జాతీయ రహదారిపై తరచూ జరిగే రోడ్డు ప్రమాదాల ప్రదేశాలను గుర్తించి నివారణ చర్యలను చేపట్టేందుకు గురువారం ఎన్‌హెచ్‌ఏఐ పర్యవేక్షణ అధికారుల బృందం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పాపారావు, ఆర్టీవో ఎస్సై జంపాని కుమార్‌లతో కలిసి పరిశీలించారు. అత్యంత ప్రమాదకరంగా ఉన్న అల్లూరు రోడ్డు రైల్వే బ్రిడ్జిని జాతీయ రహదారిపై ఉన్న వాహనాల క్రాసింగ్ ప్రదేశాలను పరిశీలించి సూచిక బోర్డులు లేని చోట ఏర్పాటు చేస్తామని త్వరలోనే బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే శాఖను సంప్రదించి పనులు చేపడతామని హైవే పర్యవేక్షణ అధికారులు తెలిపారు. వాహనాలు క్రాసింగ్ చేసే చోట డివైడర్లపై ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయాలని అల్లూరు రోడ్డు బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని బ్రిడ్జి వద్ద ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని హైవే అధికారులను కోరినట్లు సీఐ పాపారావు తెలిపారు. వీరితో పాటు దగదర్తి పోలీసు సిబ్బంది ఉన్నారు.

## విద్యుత్ ఘాతానికి గేదెలు మృతి



**చేజర్ల అక్టోబర్ 23 ప్రభాతవార్త** మండలకేంద్రమైన చేజర్లలలో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పొలంలో విద్యుత్ తీగ తెగిపడి విద్యుత్ ఘాతానికి ఐదు గేదెలు మృతి చెందాయి. భాదితరులు తెలిపిన వివరాల మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చేజర్ల గ్రామానికి చెందిన మద్దిరెడ్డి శారదా అనే మహిళ రైతు మేత కోసం పొలానికి తొలుకొని వెళ్ళడంతో పొలంలో విద్యుత్ తీగ తెగి పడడంతో విద్యుత్ తీగలో విద్యుత్ సరఫరా కావడంతో ఐదు గేదెలు మృతి చెందాయి. సుమారు వాటి విలువ నాలుగు లక్షల రూపాయాలు ఉంటుందని బాధితురాలు ఈమేరకు చేజర్ల పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. గేదెలు తమ కుటుంబానికి ఆధారంగా ఉండడంతో అవి మృతి చెందడంతో తీవ్రంగా నష్టపోయామని బాధితురాలు తెలిపారు. ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలని కోరారు. ఈవిషయంపై విద్యుత్‌శాఖ ఏఇ లిఖిత్‌రెడ్డిని ప్రభాతవార్త వివరణ కోరగా విద్యుత్ లైన్ వర్షాల కారణంగా తెగిపోవడంతో అదే సమయంలో గేదెలు ఆప్రాంతంలో పొల్లాలోకి వెళ్ళడంతో ఐదు గేదెలు మృతి చెందాయని ఆయన తెలిపారు.

## ఆర్‌డిఒగా పదోన్నతి పొందిన తహసిల్దారును సన్మానించిన కోటంరెడ్డి



**సంగం అక్టోబర్ 24 ప్రభాతవార్త** ఆర్‌డిఒగా పదోన్నతి పొందిన తహసిల్దారు సోమ్లానాయక్‌ని సీనియం "నాయకులు పడమటి పాళెం సర్పంచ్ కోటంరెడ్డి బాలకృష్ణారెడ్డి శాలుక కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సోమ్లానాయక్ సేవలను ఆయన కొనియాడారు. ఆయన ఏ పదవిలో ఉంటే ఆపదవికి వన్నె తెస్తారని ప్రశంసించారు.

## రైతులకు యూరియా పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**పొదలకూరు, అక్టోబర్ 23, ప్రభాతవార్త** పొదలకూరు మండల పరిధిలోని ఆర్‌వై పాళెం రైతు సేవ కేంద్రం నందు సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి రైతులకు యూరియా పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పొదలకూరు మండలంలో వరి పంట సాగుచేయుచున్న ప్రతి రైతు యూరియా కార్డు తీసుకోవాలి అని తెలిపారు. ఎకరాకు 3 బస్తాలు 3 దఫాలుగా పంపిణీ చేయుట జరుగుతుందన్నారు. అందులో భాగంగా గురువారం మొదటి విడత పంపిణీ చేశారు. అదేవిదంగా ప్రస్తుతం అర్ వై పాళెం, దేగపూడి, మహమ్మదపురం, తాటిపర్తి, విరువూరు, నల్లబాలెం రైతు సేవ కేంద్రాలు పొదలకూరు సొసైటీ నందు కలిపి మొత్తం 139 టన్నులు యూరియా అందుబాటులో ఉందన్నారు. ఇంకా రైతులకు కావలసిన యూరియా తెప్పించుట జరుగుచున్నందున రైతులు ఎవరు కూడా యూరియా కోసం ఆందోళన చెందవద్దు అని సోమిరెడ్డి రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు సొసైటీ అధ్యక్షులు తలచీరు మస్తాన్ బాబు, సహాయ వ్యవసాయ సహాయకులు కె. శివనాయక్, మండల వ్యవసాయ అధికారి వి.ప్రతాప్, రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జాయింట్ కలెక్టర్‌ని కలిసిన బిజెపి నేతలు



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 23, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నూతన బాధ్యతలు చేపట్టిన మొగిలి వేంకటేశ్వర్లుని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బిజెపి నేతలు ఈరోజు కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేయడం జరిగింది. జిల్లాలోని రెవెన్యూ సమస్యలు, రేషన్ బియ్యం అక్రమ దోపిడి గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ రాష్ట్ర నాయకులు వినాయకరావు, జిల్లా నాయకులు తాళ్ళపల్లి కొండయ్య, చల్లగుండ్ల సాయి ప్రసాద్, కె వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## టౌన్ ప్లానింగ్ ఆధ్వర్యంలో ఓపెన్ ఫోరం కార్యక్రమం

**నెల్లూరు కార్పొరేషన్, అక్టోబర్ 23, ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో తేదీ 24.10.25 శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి టౌన్ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో ఓపెన్ ఫోరం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని డిప్యూటీ సిటీ ప్లానర్ రఘునాథ రావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ నేతృత్వంలో జరగనున్న ఈ కార్యక్రమంలో పెండింగ్ ప్లాన్ అనుమతులు, ఎల్.ఆర్.ఎస్ అప్లికేషన్లు, టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన ఇతర సమస్యలపై పరిష్కారాలు అందించేందుకు అధికారులందరూ హాజరవుతారని తెలిపారు. కావున భవన యజమానులు, ఎల్.టి.పి లు, లైసెన్స్ సర్వేయర్లు, ఇంజనీర్లు పాల్గొని తమకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవాలని తెలియజేయడమైనది.

## కందుకూరు నుంచి శైవక్షేత్రాలుకు ప్రత్యేక బస్సులు



**వలేటివారిపాలెం అక్టోబరు 23, ప్రభాతవార్త** కార్తీక మాసం సందర్భంగా కందుకూరు ఆర్టీసీ డిపో నుంచి పంచరామ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటుచేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని బుధవారం కందుకూరు డిపో మేనేజర్ రాపూరి శ్రీనివాసులు ప్రభాతవార్తతో తెలిపారు. పంచరామ పుణ్యక్షేత్రాలైన అమరావతి, ద్రాక్షారా మం, పాల కొల్లు, భీమవరం, సామర్లకోటలలో గల సుప్రసిద్ద శైవక్షేత్రాలను దర్శించు నిమిత్తం ప్రత్యేక బస్సుసౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. ఇందుకోసం సుమారు రూ. 2వేలు టికెట్‌ను ఆన్‌లైన్‌లో సైతం చెల్లించి పైక్షేత్రాలను దర్శించుకోవచ్చన్నారు. ప్రతి ఆదివారం సాయం కాలం కందుకూరు నుంచి బస్సు బయలుదేరి దర్శనానంతరం తిరిగి మంగళవారం ఉదయానికి కందుకూరు చేరుకుంటుందన్నారు. అదేవిధంగా దక్షిణాదిప్రాంతాలైన అరుణాచలం, వెల్లూరులోని గోల్డెన్ టెంపు ల్, కంచి, తిరువత్తిణి, శ్రీకాళహస్తి, కాణిపాకం పుణ్యక్షేత్రాలకు సైతం బస్సు సౌకర్యం ఉందన్నారు. ఇందుకు సుమారు రూ 2,200ల టికెట్‌తో ఈ ప్రాంతాలును దర్శించుకోవచ్చని ఆయన సూచించారు. కార్తీక మా సంలో ప్రతి సోమవారం కందుకూరు డిపో నుంచి శ్రీశైలంకు సైతం ప్రత్యేకబస్సు సౌకర్యం అందుబాటులో ఉందని ఆయన వివరించారు. శబరిమలై వెళ్లుటకు అయ్యప్ప స్వామిభక్తులకు సైతం అద్దె ప్రాతిపదికన బస్సులు అందుబాటులో ఉన్నాయని మేనేజర్ శ్రీనివాసులు వివరించారు. పూర్తి వివరాలకు డిపో కార్యాల యంలోని సీఐ శ్యామ్‌ప్రసాద్‌తోపాటు సంబందిత సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

## వీరి చలపతికి బెయిల్ మంజూరు



**నెల్లూరు క్రైమ్, అక్టోబర్ 23, ప్రభాతవార్త:** పలు కేసుల్లో ముద్దాయిగా ఉంటూ జిల్లా కేంద్ర కారాగా రంలో ఉన్న డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్, వైసీపీ జిల్లా పార్టీ అధికార ప్రతినిధి వీరి చలపతిరావు బెయిల్ పై గురువారం విడుదలయ్యారు. పలు కేసుల్లో ముద్దయిగా ఉన్న చలపతికి నెల్లూరు జిల్లా కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో 33 రోజుల తర్వాత జైలు నుంచి విడుదలైన వీరి చలపతిరావుని జిల్లా జైలు వద్ద మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు.

## విద్యుత్ స్తంబాలు, ట్రాన్స్‌పార్మర్లు, స్టార్టర్లు తాకకండి ఎపిఎస్‌పిడిసిఎల్ ఏడి సతీష్



**బుచ్చి అక్టోబర్ 24 ప్రభాతవార్త** కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలు ఎక్కడ విద్యుత్ స్తంభాలు తాకవద్దని , అలాగే ట్రాన్స్‌పార్మర్లు, స్టార్టర్లు ముట్టుకోవద్దని బుచ్చిరెడ్డిపాళెం ఏపిఎస్‌పిడిసిఎల్ ఏడి సతీష్ సూచించారు. గ్రామాలలో ఎక్కడైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే లైన్‌మెన్‌కి లేదా, సంబందిత ఏఇకి పోన్ ద్వారా సమాచారాం ఇవ్వాలని అన్నారు. చెట్లు పడిపోయినా, విద్యుత్ వైర్లు తెగిపోయినా వెంటనే సమాచారం ఇవ్వాలని అన్నారు. ప్రజలు విద్యుత్ పరికరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.

## మల్లికార్జునపురంలో ప్రభుత్వ భూమిపై ఆక్రమణ యత్నం

-పంచాయతీ కార్యాలయం కోసం కేటాయించిన స్థలంపై బొర్లి కన్నులు
- కోట్ల విలువైన ప్రభుత్వ భూమిపై దురాశ
- ప్రజల ఆగ్రహం ఉవ్వెత్తున - పేద ప్రజల మీద దౌర్జన్యం చేస్తున్నారు



**తోటపల్లి గూడూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త:** మల్లికార్జునపురం పంచాయతీ పరిధిలోని ఈదూరు బిట్-1 రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 421లో ఉన్న ప్రభుత్వ పోరంబోకు భూమిపై ఆక్రమణ యత్నం గ్రామంలో కలకలం రేపుతోంది. మొత్తం 3 ఎకరాలు 65 సెంట్లు విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రభుత్వ భూమిలో 30 సెంట్లను పంచాయతీ కార్యాలయం నిర్మాణం కోసం కేటాయించాలని స్థానిక తెలుగుదేశం పార్టీ నేతలు నిర్ణయించారు. ఈ భూమి ప్రభుత్వ ఆస్తి కావడంతో, పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి అనువుగా ఉంటుందని ప్రభుత్వ అధికారులు భూ సర్వే చేసి ధృవీకరించారు. అయితే గురువారం ఒక ఆక్రమదారుడు గ్రామస్థులు లేని సమయంలో అక్కడకు చేరుకుని భూమి సరిహద్దు గుర్తులను పీకేసి,ఎమ్మెల్యే వచ్చి భూమి పూజ చేస్తే మాకేం భయమా!" అని గాటుగా మాట్లాడుతూ వెళ్లిపోయాడు. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది.

**– స్థానికులు ఆగ్రహంతో మాట్లాడుతూ:** ప్రజా అవసరాల కోసం కేటాయించిన ప్రభుత్వ భూమిపై కొందరు దురాశపడి ఆక్రమించడానికి ప్రయత్నించడం దారుణం. కోట్ల విలువైన భూమిపై బొర్లి కన్నేశారు. అధికారులు వెంటనే స్పందించి ఇలాంటి ఆక్రమదారులకు గుణపాఠం చెప్పాలి" అని ప్రభాతవార్తకు తెలిపారు.

**– ప్రజల హెచ్చరిక:** ఇకనైనా అధికారులు మేల్కొని ప్రభుత్వ ఆస్తులను కాపాడాలి. ఆక్రమదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో ప్రజా ఉద్యమం తప్పద" అని గ్రామస్థులు ఘాటుగా హెచ్చరించారు. ఒకప్పుడు మల్లికార్జునపురం పేద ప్రజలు ఈస్థలాలో నివాసాలు ఉండేవి. ఇప్పుడు ఈ స్థలాన్ని లేఔట్లుగా మార్చాలని ఆక్రమణదారులు ప్రయత్నిస్తున్నారు. అయితే ఈ స్థలాన్ని పేద ప్రజలకు ఇల్లు నిర్మాణం కోసం ఇవ్వాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## అత్యంత వైభవంగా కార్తీక మహా దీపోత్సవం

### - నవంబర్ 5న గణేష్ ఘాట్‌లో మహోత్సవం



**నెల్లూరు రూరల్, అక్టోబర్ 23, ప్రభాతవార్త** కార్తీక పౌర్ణమి సందర్భంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని గణేష్ ఘాట్ వద్ద నవంబర్ 5వ తేదీన అత్యంత వైభవంగా కార్తీక మహాదీపోత్సవం నిర్వహించేందుకు సన్నాహాలు జరు గుతున్నాయి. ఈ ఏర్పాట్లను పరిశీలించిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మాజీ మేయర్ నంది మండలం భానుశ్రీ ఘాట్ ప్రాంగణాన్ని సందర్శించారు.

**సింహపురి కార్తీక దిపోత్సవ సమితి ఆధ్వర్యంలో మహోత్సవం:** సింహపురి కార్తీక దిపోత్సవ సమితి ఆధ్వర్యంలో జరగబోయే ఈ మహా దిపోత్సవానికి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. స్థానిక ప్రజల సహకారంతో అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ ఈ మహా దీపోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహిస్తాం అని ఎమ్మెల్యే తెలిపారు.

**కార్యక్రమాల సమయాలు:** సాయంత్రం 5గంటలకు మహిళలతో శోభాయాత్ర ప్రారంభం, సాయంత్రం 6గంటలకు గంగాహారతి కార్యక్రమం, 108 తెప్పలతో శివాకృతి కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. సామరస్యానికి చిహ్నం- అందరూ పాల్గొనండి: ఈ దీపోత్సవం రాజకీయాలకు అతీతంగా, భక్తి, సామరస్యానికి చిహ్నంగా నిలవాలి. అన్ని పార్టీలు, సేవ సమితులు ఒకే కుటుంబంలా కలిసి ఈ మహోత్సవంలో పాల్గొనాలని కోరుతున్నాను అని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నవంబర్ 5వ తేదీ సాయంత్రం 5గంటలకు కుటుంబ సభ్యులతో కలిసి గణేష్ ఘాట్‌కు విచ్చేసి కార్తీక మహా దీపోత్సవంలో భాగస్వాములు కావాలని అందరికి ఆహ్వానం అని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కువ్వాకొల్లు విజయలక్ష్మీ, సింహపురి కార్తీక దీపోత్సవ సమితి అధ్యక్షురాలు వెన్నెల, ప్రధాన కార్యదర్శి మల్లిక, ఉపాధ్యక్షురాలు జయప్రదమ్మ, కార్యనిర్వాహక అధ్యక్షుడు కోడూరు జయరాం, ఏవీఆర్ మోహనరావు, రఘునాథరాజు, జనార్ధనరాజు, పాలయ్య, క్లస్టర్ ఇన్‌చార్జిలు, కో క్లస్టర్ ఇన్‌చార్జిలు, డివిజన్ అధ్యక్షుడు ఉచ్చూరు సురేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యూరియా విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు



**కోవూరు, అక్టోబరు 23ప్రభాతవార్త :** జిల్లాలో యూరియా విషయంలో రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సి న అవసరం లేదని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు రైల్వే స్టేషన్ పరిధిలో ఉన్న గూడ్స్ యార్డ్‌లో గురువారం యూరియా లోడ్‌తో రైలు రావడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురువారం వచ్చిన లోడ్‌లో 2600 మెట్రిక్ టన్నులు యూరియా వచ్చిందని, అందులో నెల్లూరు జిల్లాకు 1580 మెట్రిక్ టన్నులు, తిరుపతి జిల్లాకు 1020 మెట్రిక్ టన్నులు యూరియా కేటాయించడం జరిగిందన్నారు. నెల్లూరు జిల్లాకు కేటాయించిన 1580 మెట్రిక్ టన్నుల యూరియాను జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న డీలర్లకు, సహకార సొసైటీలకు, రైతు సేవా కేంద్రాలకు పంపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు సహాయ వ్యవసాయ సంచాలకులు జి. అనిత, నర్సోజీ, మండల వ్యవసాయాధికారిణి రజని, తదితరులు ఉన్నారు.

## పౌరసరఫరాల శాఖ ఏఎస్ఓ అంకయ్య బదిలీ



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 23, ప్రభాతవార్త** జిల్లా పౌరసరఫరాల శాఖలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బదిలీలు జరిగాయి. ఈ క్రమంలో నెల్లూరు ఏఎస్ఓగా విధులు నిర్వహిస్తున్న డి.అంకయ్యను ప్రభుత్వం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అంకయ్యను అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కు బదిలీ చేశారు ఈయనస్థానంలో,నెల్లూరుకు పి.వాణి నూతన ఏఎస్ఓ గా రానున్నారు.

## భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ



**బుచ్చి అక్టోబర్ 23 ప్రభాతవార్త** భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బుచ్చిరెడ్డిపాళెం మున్సిఫల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ సూచించారు. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాల మేరకు చైర్‌పర్సన్, మున్సిపల్ కమీషనర్ బాలకృష్ణా తో కలిసి బైపాస్‌రోడ్డు నాలుగో వార్డు రెయిన్‌బో స్కూల్ దగ్గర ఉన్నటు వంటి గుడిపల్లి కాలువను పరిశీలించారు. కాలువలో ఎక్కడ నీరు ఆగకుండా చెత్తను తొలగించాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. కాలువ మీద ఉండే ప్రజలు తమకు సైడు డ్రైన్ కావాలని చైర్‌పర్సన్ కి తెలియజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతు కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో నుడా నిధులు 50లక్షల రూపాయాల వ్యయంతో ఆర్సీసి వాల్స్ ( కాంక్రీట్ వాల్ నిర్మాణం పనులు ) చేపడతామని తెలియజేశారు. వర్షాలు తగ్గిన వెంటనే ఈ నిర్మాణం పనులు చేపడతామని తెలియజేశారు. వర్షాలు తగ్గేంత వరకు అందరు ఇంట్లో ఉండాలని అవసరమైతే తప్ప ఎవ్వరు బయటకు రావద్దని చైర్‌పర్సన్ సూచించారు. ఈకార్యక్రమంలో ఏఇ వెంకటేష్, శానిటేషన్ ,వాటర్ ,కరెంట్, డిపార్ట్మెంట్ మేస్త్రీలు పాల్గొన్నారు.